

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :12   సంచిక: 06   హైదరాబాద్   2012 అక్టోబరు   పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com**   వార్షిక సభ్యత్వం : రూ. 100/-




# జూబ్లీబాబా సెంటర్ 26వ వార్షికోత్సవం

**2012 నవంబరు 18, ఆదివారం, 9 a.m – 7 p.m**

హైదరాబాద్‌లోని జూబ్లీ బాబా సెంటర్ 26వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక బాబా ప్రేమిక సహవాస్ 2012 నవంబరు 18, ఆదివారం ఉదయం 9 నుండి రాత్రి 7 వరకూ ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి శ్రీ పి. రాజేంద్రమెహెర్ **(98490 46848)** ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెర్‌బాబా ప్రవచనములు

## జూబ్లీ హిల్సులోని బాబా సెంటర్‌లో

జూబ్లీ హిల్సులోని బాబా సెంటర్‌లో 28.10.2012, ఆదివారం, ఉ. 10.30 నుండి 12 గంటల దాకా మెహెర్‌బాబా వారి ప్రవచనములు – **స్వార్థం** – అనే అంశంపై ఒక ప్రత్యేక గోష్ఠి ఏర్పాటు చేశారు. ఆ రోజున ఉ. 10 నుండి 10.30 బాబా ప్రార్థనలు, భజనలు, అనంతరం బాబావారి ప్రవచనాలపై ప్రసంగం ఉంటుందని, ఆసక్తిగల వారు తప్పక హాజరుకావాలని సెంటర్ కార్యదర్శి శ్రీ రాజేంద్ర మెహెర్ తెలియజేశారు.

ప్రతి నెలా మూడవ ఆదివారం ఉ. 10.30 నుండి 12 గంటల దాకా ముందుగా ఎంపిక చేసిన అవతారుని ప్రవచనాలపై గోష్ఠి వుంటుందని ఆయన అన్నారు. ఐతే, అక్టోబరు నెల మూడవ ఆదివారంనాడు ఖోజాగూడా మనోనాశ్ కొండపై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసిన దృష్ట్యా, ప్రవచనాలను అక్టోబరు నెలలో మాత్రం నాల్గవ ఆదివారం, 28-10-2012 ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కాగా గోష్ఠిలో ఎంపిక చేసే అంశాలు **DISCOURSES BY MEHER BABA** ఆంగ్ల గ్రంథంలోని విషయ సూచిక ఆధారంగా వుంటుందని, ఆ మేరకు మొత్తం అంశాలు పూర్తయ్యే దాకా జూబ్లీ హిల్సు సెంటర్‌లో ప్రతి నెలా – **నెల నెలా బాబా ప్రవచనాల కార్యక్రమం** – కొనసాగుతుందని, కార్యదర్శి పేర్కొన్నారు.

## బాబా సందేశం

భగవంతుని ప్రేమలో మత్తిల్లినవారు మస్తులు. బాహ్య ప్రపంచానికి పిచ్చివారుగా కనిపించినా అంతరికంగా దైవోన్మాదులై నిరంతరం భగవత్ చింతనలో జీవిస్తూ, మార్గం తప్పి గమ్యం కానరాక తికమకపడుతున్న బాటసారులు వీరు. వీరిని సమాజం ఉపేక్షించి పిచ్చివారిగా భావించి హింసించింది. అటువంటి వేలాదిమంది మస్తులను మెహెర్‌బాబా ఆదరించి, సేవించి ఆధ్యాత్మికంగా వారికి ఒక త్రోవుని ప్రసాదించారు. అటువంటి బృహత్కార్యం అవతార పురుషుని వల్ల మాత్రమే సాధ్యం. **-మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ 6-9
3. సద్గురువు-జనకమహారాజు 10-12
4. గుస్తాద్ జీ 13-18
5. సర్వధర్మాన్ పరిత్యజ్య... 19
6. లార్డ్ మెహెర్ 20-30
7. విశాఖ సాగరతీరాన 31
8. బాటసారులు 32
9. పూజ 33
10. చల్లపల్లి బాబా సెంటర్ 34
11. ముఖచిత్రం 35-37

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# ఖోజాగూడా - మనోనాశ్ కొండ



ఖోజాగూడాలోని మనోనాశ్ కొండపై అక్టోబరు 21న, ఆదివారం ఉ. 10 నుండి మ. 12.30 దాకా బాబా సహవాస్ ఏర్పాటుచేశారు. ఖోజాగూడా దాకా వెళ్ళేందుకు మల్కాజిగిరి, చైతన్యపురి, కోఠి బాబా సెంటర్‌ల నుండి ఉ. **8** గంటలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

## నవజీవనం-మనోనాశ్

అవతార్ మెహెర్‌బాబా 1949 అక్టోబరు 16, నవజీవనం ప్రారంభించారు. ఈ నవజీవనం అనంతమైనది. ఎవరైతే అసత్యం, ద్వేషం, క్రోధం, లోభం, కామం - పూర్తిగా త్యజించి జీవితం గడుపుతారో, ఎవరికీ - దేనికీ భయపడక అంతా భగవంతుని ఇచ్ఛగా భగవంతుని ప్రేమిస్తూ శేషజీవితం గడుపుతారో వారందరిచేత నవజీవనం నిరంతరంగా జీవిస్తుందని మెహెర్‌బాబా తన సందేశంలో పేర్కొన్నారు. బాబావారు గడిపిన నవజీవనంలో భాగంగా 16.10.1951 న మనోనాశ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఖోజాగూడ కొండపై గడిపారు.

బాబావారు నిర్వహించిన **నవజీవనం - మనోనాశ్ కార్యక్రమాలను** స్మరించుకుంటూ, ఆనాటి బాబా సందేశాలపై ఖోజాగూడలో 2**1.10.2012** న బాబావారి ప్రేమిక సహవాస్ ఘనంగా జరిగింది. బాబా ప్రేమికులు పలు ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవ వేడుకలు 8వ సహవాస్
## (1963 - 2013)

అవతార్ మెహెర్‌బాబా విజయనగరం జిల్లాలోని అన్ని కేంద్రముల మెహెర్ ప్రేమికుల ఆధ్వర్యంలో 2012 అక్టోబరు, 13, 14 తేదీలలో మెహర్‌స్థాన్ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు శ్రీ కొల్లి రామారావు తెలిపారు.

## సంపాదకీయం

# ACTIONLESS ACTIONS

1951 అక్టోబరు 16 నుండి 23 దాకా హైదరాబాద్‌లోని ఖోజాగూడా కొండ మీదున్న గుహలో **మనోనాశ్ కార్యక్రమాన్ని 7 రోజులపాటు** నిర్వహించారు. ఆ సమయంలో దగ్గర్లోనే వున్న హిందూ దేవాలయంలో, అలాగే దర్గాలో కొంతసేపు బాబా ఏకాంతవాసం వున్నారు.

మెహెర్‌బాబా 1951 మే 27, ఆదివారం నాడు హైదరాబాద్‌కు తన మండలి ప్రేమికులందరితో వచ్చి, జూబ్లిహిల్సులోని ఇ.నెం. 6-5-591, 'కోహినూర్' బంగళాలో సుమారు ఆరు నెలలు బసచేశారు. జంటనగరాలలో ఎందరో మస్తులతో సాంగత్యం చేశారు. భాగ్యనగరం ఆధ్యాత్మికతకు ఆలవాలం అని బాబా ప్రశంశించారు. అందుకే ఈ నగరం నాకెంతో ఇష్టమన్నారాయన.

1951 జూన్ 20 - 30 తేదీలలో అన్ని రాష్ట్రాలలోని ఎంపిక చేసిన 70 మంది ప్రేమికులను హైదరాబాద్‌కు ఆహ్వానించి, వారితో ఒక ప్రత్యేక సమావేశం మూడ్రోజులపాటు బాబా నిర్వహించారు. ఆ సమావేశంలో తాను చేపట్టబోయే మనోనాశ్ కార్యక్రమం గురించి వివరించారు. మనస్సు గురించి బాబా తన సందేశంలో - అది బహు చంచలమైందన్నారు. అనేక ఆలోచనలూ, కోర్కెలుతో, సంస్కారాల వలయంలో మనస్సు చిక్కుకుని వుంటుందన్నారు. నిత్యం మనం చూస్తున్న చావు-పుట్టుకలు, సుఖ దుఖాలు, ఇదంతా నిజమననే భ్రాంతిని మనస్సు కల్గిస్తుందని మెహెర్‌బాబా స్పష్టం చేశారు. నేను పురుషుడిని లేదా నేను స్త్రీని, అందమైనవాడిని, తెలివైనవాడిని, మంచివాడిని, పరోపకారిని, లేదా ఇందుకు విరుద్ద గుణగణాలు అన్నీ కూడా మనస్సును అంటిపెట్టుకుని వున్న సంస్కారాల బంధనాల ప్రభావమేనన్నారు. మానవ జీవన లక్ష్యం మనోనాశ్ కావాలన్నారు మెహెర్‌బాబా. మనస్సును అదుపులో వుంచుకొనే ప్రయత్నం చేయమన్నారు. ఇందుకు **ACTIONLESS ACTIONS** విధానాన్ని పాటించ మన్నారు. సూక్ష్మమంగా చెప్పాలంటే, తామరాకు మీద నీటి బొట్టులాగా ఉండటం ఉభయకుశలోపరన్నది బాబా వారి ఉవాచ.

❋ ❋ ❋

ఆ విధంగా మెహెర్‌బాబా హైదరాబాద్‌లో సుమారు ఆరు నెలలు (1951 మే 27 నుండి అక్టోబరు 23) గడిపారు. ఇది జరిగి 60 సంవత్సరాలు పైబడింది. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులు గుర్తుచేసుకునేలా ఒక ప్రేమిక సహవాస్ ఏర్పాటుకు ఇది సరైన సమయం. అలాగే, బాబా ప్రేమికులందరూ హైదరాబాదీయులే కాక ఇతరులందరూ కూడా వారి వారి వీలునిబట్టి ఈ అరుదైన ప్రాంగణంలో కొంత సమయం గడిపేందుకు ప్రయత్నించాలి. ఆ మేరకు సంబంధిత నిర్వాహకులు తగిన సమాచార ఏర్పాట్లు చేయగల్గితే బాగుంటుంది. ❋

### అవతారుని ప్రవచనం

# లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్



ఒక సందర్భంలో ఒక భక్తుడు అడిగిన సమస్యపై మెహెర్‌బాబా తన చుట్టూచేరిన భక్తులనుద్దేశించి ఇచ్చిన సందేశంలో ఇలా అన్నారు. ఆనాటి మెహెర్‌బాబా మాటలు యధాతథంగా ఇలా వున్నాయి. దయచేసి పరిశీలించండి. బాబా ప్రతివాళ్ళూ వారికి తెలియకుండానే అనుక్షణం జీవితంలో ఏదో పోగొట్టుకున్నామని, విసిగిపోయామనీ అనుకుంటారు. ఏదో అనూహ్యమైన ఆనందం పొందాలని ఆరాటపడతారు. ఐతే వారికి ఎలా ఆనందించాలో మాత్రం తెలియక, జీవితంలో విసిగి వేశారామని భావిస్తారు. ఇది సహజం అని బాబా అన్నారు.

**ఐతే జీవితం చాలా మధురమైంది. జీవితం అందమైంది అని బాబా స్పష్టం చేశారు.**

మనిషి జీవించినంత కాలం ఆనందంగా వుండాలని బాబా తన భక్తుల్ని కోరారు. అందుకు నా సహాయం మీకు తప్పక లభిస్తుందని బాబా భరోసా ఇచ్చారు.

అలా అనుకోవడం ద్వారా చాలా మార్పు వచ్చిందనిపిస్తుంది.

ఆ మార్పుని మీరు చాలా చక్కగా చూడగల్గుతారు కూడా.

**యద్భావం తద్భవతని** బాబా అన్నారు.

మనం ఎలా చూస్తే ఆ మాదిరిగా ఆ విషయం కనిపిస్తుంది.

మనం చూసే దాంట్లో వుంది.

ఈరోజు నేను బాగా అలసిపోయాననుకుంటారు.

చాలా నిర్లిప్తంగా వుందని భావిస్తారు.

నీ చుట్టు ప్రక్కల వున్న ప్రతీది నిర్జీవంగా కనిపిస్తుంది.

నీ చుట్టు ప్రక్కల వున్నదంతా అందవిహీనంగా వుందనిపిస్తుంది.

ఆ మర్నాడు నీవు హుషారుగా, హాయిగా, ఆనందంగా వున్నట్లయితే,

నిన్నటి రోజున కనిపించిన ప్రతి విషయంలో ఏదో మార్పు వచ్చినట్లు నీవు భావిస్తావు.

నీలోని ఈ మార్పుకు కారణం నీలో వచ్చిన స్వల్ప ఆనందం, హుషారేనని గమనించమని బాబా సూచించారు. ఇది మానసికంగా నీలో వచ్చిన మార్పుకు సంకేతం. అందువల్ల ప్రతి చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకోవద్దు. నేను సంతోషంగా వుండాలి. నా వల్ల – నా చుట్టు ప్రక్కలవారందరూ సంతోషంగా, ఆనందంగా వుండాలని, మీలో మీరే అనుకోండి. క్రమేణా మీరు – మీ చుట్టు ప్రక్కలవారు అందరూ చాలా ఆనందంగా వుండగల్గుతారు.

ఎప్పుడూ నేను అలసిపోయాను, ఈ పని వత్తిడితో చచ్చిపోతున్నాను.

అంతా నేనొక్కడినే చేస్తున్నాను లాంటి ఆలోచనల్ని మీ మనస్సులోకి రానీయొద్దు.

ఈ ఆలోచనలే మిమ్మల్ని మరింత మానసిక క్షోభకు గురిచేస్తాయి.

అంతా బాగుంది.

హాయిగా, తృప్తిగా వుంది.

నేను హాయిగా వున్నానని భావించండి. జీవితం అందమైంది, ఆనందమయమని ఆలోచించండి.

ఆధ్యాత్మికంగా మీకు అన్ని విధాలా సహాయం చేయడానికి నేనున్నానని మెహెర్‌బాబా తన సందేశంలో పేర్కొన్నారు.

మరో సందర్భంలో బాబా స్వయంగా ఇలా అన్నారు.

సాధ్యమైనంత మేరకు హాయిగా నవ్వుతూ, సంతోషంగా వుండండి.

ఏదో కొండచరియలు మీద పడిపోతున్నట్లు,

మరో క్షణంలో పెద్ద ప్రమాదం వాటిల్లబోతున్నట్లు –

నిష్కామంగా, చేష్టలుడిగి – బాధాతప్త హృదయంతో ఎప్పుడూ ఉండొద్దు.

జీవితం నిర్లిప్తంగా, నిర్జీవంగా ఉందని ఎప్పుడూ భావించొద్దు.

ఈ జీవితంలో అనేక కష్టాలుతో విసిగెత్తిపోయానని ఎప్పుడూ అనుకోవద్దు.

ఈ ఆలోచనలే మిమ్మల్ని మరింత కుంగదీస్తాయి.

**But, if you think "LIFE IS WORTH LIVING;"**
**all difficulties will appear insignificant.**

ఇతరులను, ఎదుటివారిని ప్రేమించడం అలవరచుకోండి.

ఇందుకు నేను సహాయపడతాను.

నేను ఒంటరి వాడననో, నాకెవరూ లేరని,
నేనొక్కడినే ఇంకా ఎంతో చేయ్యాల్సివుందనీ,
నేను పేదవాడిననే ఆలోచనలు ఎన్నడూ మీ మనస్సులోకి జొరబడనీయకండి.
అందరూ పేదవాళ్ళేనని గమనించండి.
ఈ యావత్తు ప్రపంచం పేదలతో – పేదరికంతో నిండి వుంది.
కోట్లకు పడగలెత్తిన అత్యధిక ధనవంతులు కూడా పేదవారే.
ఎందుకంటే వారిలో తీరని అత్యాశ, ఇంకా ఏదో లేదనే బాధ,
తీరని కోర్కెలు వారిని వెంటాడుతుంటాయి. అదే వారి పేదరికానికి సంకేతాలు.
మీ తోటివారిని ప్రేమించండి.
అన్ని సమస్యలూ తొలిగిపోతాయి. ...........
మెహెర్‌బాబా ఇంకో మాట చెప్పారు –
జీవించినంత కాలం తృప్తిగా వుండమన్నారు.
ఈనాడు సంపదలున్నా – జేబులో దమ్మిడి లేకపోయినా,
అందంగా వున్నా, అనాకారిగా వున్నా,
ఇలా ఏమో, ఏమైనా,
ఈనాడు మీరు ఈ స్థితిలో వున్నందుకు,
అంతా దేవుని ఇచ్ఛగా భావించండన్నారు.
ఆధ్యాత్మిక ఉన్నతి కావాలని భగవంతుని కోరుకోవాలని కానీ,

సిరి సంపదలు, సుఖ సంతోషాలు కాదనీ, వీటి వల్ల మళ్ళీ మళ్ళీ బంధనాలు పెరుగుతాయని బాబా స్పష్టం చేశారు. ధనం, కీర్తి, అధికారం, ఆరోగ్యం, సంతానం, కావాలని భగవంతుడిని ఎన్నడూ ప్రార్థించవద్దన్నారు బాబా.

భగవంతుని కృప **(Grace)**ని కోరండి.

ఆయన కృపతో అనంత ఆనందం లభిస్తుందని బాబా తన భక్తులకు హితవు చెప్పారు.

ఈ విషయంపైనే బాబా మండలి సభ్యుడు ఏరుచ్ ఒక చక్కని పౌరాణిక కథాంశాన్ని చెప్పారు. అదేమంటే....ఇకపై ఏరుచ్ మాటల్లోనే పరిశీలించండి!

శివుని భక్తుడొకరు కడు పేదరికంతో బాధపడుతున్నాడు.
ఐనాకూడా, ఆ భక్తుడు ప్రతి నిత్యం, అనుక్షణం ఈశ్వరుని నామస్మరణతో
ఎంతో భక్తి శ్రద్ధలతో కాలం గడుపుతున్నాడు.

అతని భక్తిని, ఆతను నిత్యం చేసే భగవన్నామాన్ని ఈశ్వరుడు ఏమీ గమనించడం లేదని పార్వతీదేవి భావిస్తుంది. ఆ భక్తుని భక్తిని చూసి చలించిన పార్వతీ దేవి

తన భర్తతో ఆ పేదవానికి ఏ విధంగానైనా సహాయం చేయమని కోరుతుంది.

అంతేకాదు, అంత పేదరికంలో వుండి కూడా, అనుక్షణం భగవన్నామ స్మరణతో

గడుపుతున్న భక్తుడి పైనే తన భర్త ప్రేమ కురిపించపోతే, ఇక తనపై ఆయనకు ఏమాత్రం ప్రేమ వుందోనని భయపడుతున్నానని పరమేశ్వరునితో పార్వతి అంటుంది.

భక్తులందరిపై తనకు సమానమైన ప్రేమ వుందని, వారి కోసం, వారికి ఎలాంటి సహాయమైనా అందించేందుకు తాను అనుక్షణం సిద్ధంగా వున్నానని శివుడు అంటాడు.

ఐతే, పార్వతీ దేవి శివుని మాటలను వేళాకోలంగా కొట్టిపారేస్తుంది.

ఐతే ఆ ఫలానా ఆ పేద భక్తునికి ఏ సహాయం అందించాలనుకుంటున్నారని పార్వతీ దేవి శివుడిని తిరిగి అడుగుతుంది.

అంతేకాదు, అతగాడికి ఏదైనా గట్టి ఆర్థిక సహాయం అందించమని పార్వతీ దేవి కోరుతుంది. అందుకు పరమ శివుడు సరేనన్నాడు.

ఇదిలాఉంటే, భూలోకంలో ఆ పరమ శివభక్తుడు మరో ఆలోచనలో వున్నాడు. అతని ఆలోచనలు ఇలా వున్నాయి. భిక్షాటనతో ఏ పూటకాపూట ఎలాగో కాలం ఆనందంగానే గడుస్తోంది. కానీ, రాబోయే రోజులు చాలా గడ్డు రోజులు సుమీ.

నేడు ప్రజలు అయ్యా అని అడుక్కుంటుంటే తృణమో – ఫలమో జోలిలో వేస్తున్నారు.

కానీ, రాబోయే రోజులు గడ్డు రోజులు.

ప్రజల్లో ఈ మాత్రం కరుణ – దయ వుండకపోవచ్చు. అలాంటప్పుడు పూట గడవటం కష్టం కదా!

అందుకని కళ్ళులేని కబోది లాగా, బిక్షం ఎత్తడం ప్రారంభిస్తే, నాలుగు రూకలు వెనకేసుకుని, భవిష్యత్తులో సునాయాసంగా గడపొచ్చు కదా అని భావించాడు.

అతనికి ఆ ఆలోచన వచ్చిందే తడువుగా గ్రుడ్డివాడుగా, కళ్ళులేని కబోదిగా భిక్షాటన ప్రారంభించాడు.

సరిగ్గా ఇదే సమయంలో పార్వతీ దేవి కోరిక మేరకు పరమ శివుడు ఈ పేదవానికి ఆర్థిక సహాయార్థం అందించాలన్న ఆలోచనతో ఆకాశం నుండి బంగారు కాసులున్న గోనె సంచి నొకదాన్ని ఆ భక్తుని ప్రక్కన పడేలా వదిలాడు.

ఐతే, అప్పటికే గ్రుడ్డివాని వేషం ఎత్తిన బిక్షగాడికి, ఆ బంగారు నాణేలు గల గోనె సంచి అతని ప్రక్కనే వున్నా అతడు దాని ఉనికినే గమనించ లేదు.

పరమేశ్వరుడు పార్వతీదేవికి ఈ దృశ్యాన్ని చూపిస్తూ, చూశావా!

బంగారం నాణెలు అతని ప్రక్కనే వున్నా చూడలేక పోతున్నాడతను.

ఆ పేదవానికి పది తరాలకు సరిపడినంత సహాయం అందించినా ఫలితం మాత్రం శూన్యం. ఇది **LAW OF KARMA** కు సంకేతం.

నీ జీవితంలో ఎంత పొందాలన్నది గత జన్మ సంస్కారాలపై ఆధారపడి వుంటుందని, ఎవరు ఏమేరకు ఎంత పొందాలన్నది అంతా ముందుగానే నిర్ణయించబడి వుంటుందని పరమశివుడు చమత్కరించాడని ఏరుచ్ తను చెప్పే కథాంశాన్ని ముగించాడు.

# సద్గురువు - జనక మహారాజు

బాబా మండలి ప్రేమికుడు- ఏరుచ్ జెస్సావాలా - సుఖ సంతోషాలతో, ధనరాసుల మధ్య తులతూగుతున్నా కూడా వాటితో ఎలాంటి సంబంధం లేకుండా ఆధ్యాత్మిక జీవనంలో భగవన్నామ స్మరణతో ముందుకు సాగాలని మెహెర్‌బాబా తన సందేశాలలో పలుమార్లు పేర్కొన్నారని, ఇదెలా సాధ్యమౌతుందో మెహెర్‌బాబా తెలిపిన ఒక సంఘటనను ఇలా వివరించారు.

ఇకపై ఏరుచ్ మాటల్లోనే ఆ విషయాన్ని మీరూ దయచేసి గమనించండి!

శ్రీరాముడి తండ్రి జనక మహారాజు.

అయోధ్యా రాజ్యానికి చక్రవర్తి.

ఇది మనందరికీ తెలిసిన విషయం.

జనక మహారాజు కేవలం గొప్ప చక్రవర్తి మాత్రమే కాదు.

ఆయన గొప్ప సద్గురువు కూడా అని మెహెర్‌బాబా పేర్కొన్నారు.

ఐతే ఈ అసాధారణ విషయం స్థానిక ప్రజానీకానికి అంతగా తెలియదు.

కాగా ఒక సందర్భంలో ఆధ్యాత్మిక పథంలో ముందంజలో వున్న ఒక వ్యక్తి జనకుని గురించి తెలుసుకుని ఆయన దర్శనం చేసుకుందామని రాజాస్థానానికి వచ్చాడు.

కానీ ఆయన్ని రాజభటులు లోనికి అనుమతించరు.

**నేను గొప్ప** ఆధ్యాత్మిక జిజ్ఞాసినని మహారాజు జనకునికి తెలియజేసి, తనని లోనికి అనుమతించాలన్నాడు.

జనకుడు ఈ కబురు విని, ముందుగా **'నేను'**ని వదిలివేయమని చెప్పి జ్ఞానికి కబురు పంపాడు.

తిరిగి రాజ భటునితో **- నేను - ఫలానా - ఫలానా** - అని జనకునితో చెప్పమని తిరిగి లోనికి పంపాడు.

ఇదంతా గమనిస్తున్న జనకుడు తిరిగి **'నేను' ఫలానా** అనే విషయాన్ని వదిలి లోనికి రమ్మనమన్నాడు.

ఇదేమీ పాలుపోక, ఆ వచ్చిన జ్ఞాని రాజ భటునితో జనకుని మాటలను మరింత వివరంగా చెప్పమని ప్రాధేయపడగా, **'నేను - నాది'** అనే అహంకారాన్ని వదలి రమ్మనమని చక్రవర్తి అభిప్రాయంగా తెలియజేశాడు.

చక్రవర్తి సూచనలను పాటించిన జ్ఞానిని రాజాస్థానంలోనికి ప్రవేశపెట్టారు.

ఆ సమయంలో జనకుడు తన పరివారంతో పరాచకాలు ఆడుతూ, అందరి నవ్వుల కేరింతల నడుమ వున్నాడు.

జనకుడు తన శిరస్సుపైన రత్న వైఢూర్యాలు పొదిగిన కిరీటాన్ని ధరించాడు.

ఆ రాజ్యానికి చక్రవర్తిగా, జనకుడి భోగ భాగ్యాలకు, అలంకరణలకు కొదవేమి వుంటుంది?

రాజస్థానాన్ని చేరిన జ్ఞాని ఆ పరిసరాలు గమనిస్తూ, ఇంతటి భోగి సద్గురువు ఎలా అవుతాడు? అని మనస్సులోనే సంశయంతో వున్నాడు.

ఇది గమనించిన జనకుడు రాజభటులని పిలిచి, ఒక కప్పు నిండా వేడి వేడి పాలను తీసుకురమ్మన్నాడు.

అయోధ్యా నగరంలో వాడవాడలా గొప్ప వేడుకలు నిర్వహించమని మంత్రులను ఆదేశించాడు.

ఆ తర్వాత మరో ఇద్దరు రక్షక భటులను పిలిచాడు.

వారిద్దర్నీ జ్ఞానికి కుడి, ఎడమలలో నిలుచోమన్నాడు.

అనంతరం జ్ఞాని చేతిలో పాలతో నిండుగా వున్న కప్పుని వుంచి,

కప్పులో నుంచి ఒక చుక్క పాలు నేలపై పడకుండా, నగరమంతా తిరిగి, చివరకు రాజస్థానంకు రావాలని ఆదేశించాడు.

అదే సమయంలో ఒక్క పాల బొట్టు నేల మీద రాలినా ప్రక్కనే వున్న భటులు ఆతని తల తీసేస్తారని చెప్పాడు.

ఇదే విషయాన్ని రక్షక భటులతో జనకుడు తిరిగి అర్థమయ్యేలా చెప్పాడు.

కుడి, ఎడమలలో రాజభటులు వెంటరాగా, ఆ జ్ఞాని చేతిలో నిండుగా వున్న పాల కప్పుతో ఒక చుక్క కూడా నేలపై పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ, ఏకాగ్రతతో పురవీధుల గుండా జ్ఞాని నడిచాడు.

ఆ సమయంలో అయోధ్యా నగరంలో పెద్ద మేళా నిర్వహించమని చక్రవర్తి ప్రకటించాడేమో, నగర వీధులు డప్పులు బ్యాండు వాయిద్యపు రణగొణ ధ్వణులతో ప్రతి ధ్వనిస్తోంది.

ప్రజలు బిగ్గరగా పాటలు పాడుతున్నారు.

సంగీత ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు.

నగరమంతా రణగొణ ధ్వనులతో గడబిడగా వుంది.

ఐనా కూడా కప్పులోనించి ఒక్క చుక్క పాలైనా నేలమీద పడకుండా, జ్ఞాని నగరమంతా తిరిగి క్షేమంగా రాజస్థానం చేరాడు.

వారు అలా తిరిగి వచ్చాక ఎక్కడా ఏమీ జరగలేదు కదా అని జనకుడు వాకబు చేసాడు. ఆ దరిమిలా నగర పర్యటనలో మీ చుట్టుప్రక్కల ఏమేమి చూశావ్? అని జనకుడు జ్ఞానిని ప్రశ్నించాడు.

ఆ జ్ఞాని ఏమన్నాడో తెలుసాండి!

'నేనేమీ చూడలేదు. నాకేమీ వినపడలేదు'

కేవలం కప్పులో పాలు పొర్లిపోవద్దన్నది ఒక్కటే ధ్యేయంగా నగరమంతా తిరిగి క్షేమంగా వచ్చానని జవాబిచ్చాడు.

ఆ మాటలు వింటూనే జనకుడు, నేను కూడా అంతే!

నేను చక్రవర్తిగా రాజ్యపాలన చేస్తున్నా

నిరంతరం భగవంతుని స్మరణలో,

ఆయన ధ్యాసలోనే గడుపుతాను.

మరి ఇతర బహిర్గత విషయాలు నాకు పట్టవని స్పష్టం చేశాడు.

దాంతో ఆ జ్ఞాని జనకుని పాదాలపై పడి,

రోదించి తన కన్నీటితో జనకుని పాదాభిషేకం చేసి

తనని శిష్యునిగా స్వీకరించమని వేడుకున్నాడు.

ఆధ్యాత్మికత అంటే తామరాకు మీద నీటి బొట్టు మాదిరి ఉండాలని ఏరుచ్ ముగించాడు.

# హెల్ప్ లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 19 లేదా 20 తేదీలలో సికిందరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీ నాటికి పత్రిక మీ ముంగిట వుంటుంది. **పత్రిక అందుటలో ఆలస్యమైతే** శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492–42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.**

**గత రెండేళ్ళుగా వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల పేర్లు త్వరలో తొలిగించవలెనని నిర్ణయించడమైంది. కావున వారికి 2012 నవంబరు సంచిక పోస్టు చేయబడదని గమనించగలరు.**

# పెరికేడు బాబా సెంటర్

02.10.2012 న అవతార్ మెహెర్‌బాబా పెరికేడు సెంటర్ 6వ వార్షికోత్సవ కార్యక్రమాలు శ్రీ చింతా సీతయ్య జూనియర్ కళాశాల ఆవరణలో వైభవోపేతంగా జరిగాయని స్థానిక బాబా సెంటర్ సెక్రటరీ ఆర్. సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీమతి కర్రి హిమబిందు, బి. రామకృష్ణయ్య, శ్రీ మెహెర్ ప్రసాద్‌రాజు, శ్రీమతి ఆర్. సుబ్బలక్ష్మి, శ్రీ యాగంటి సుబ్బయ్య, శ్రీ కనకయ్య, తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు.

గు.ప్లీ.కృ

గత సంచిక తరువాయి



# గుస్తాద్ జీ

ఆంగ్ల మూలం: TEARS OF JOY

శ్రీ అన్నా ఖండాలే,
మెహెరాబాద్.

తెలుగు సేత: మల్లాది కృష్ణానంద్

## సాకోరీ యాత్ర

ఇది 1923 అక్టోబరు మాసం నాటి విషయం!!

మెహెర్‌బాబా తన శిష్యులు కొందరితో కలిసి ముంబాయి నుంచి సాకోరీకి బయలుదేరి వెళ్ళారు. సాకోరీ దాకా వెళ్ళక మునుపే, మెహెర్‌బాబా బబ్లేశ్వర్ అనే గ్రామం దగ్గర ఆగిపోయి అక్కడ తనతోపాటు ఒక శిష్యుడ్ని వుంచుకుని మిగిలిన వారందరినీ గుస్తాజీ నేతృత్వంలో సాకోరీకి వెళ్ళి ఉపాసనీ మహారాజ్ దర్శనం చేసుకోమన్నారు. మహారాజ్ అంతక్రితం 10 నెలల నుండి వెదురు బొంగులతో ఒక పంజరంలా చేసుకుని అందులోనే అన్నపానీయాలు తీసుకుంటున్నారు. మెహెర్‌బాబా శిష్యులు కంటబడగానే మహారాజ్ కోపోద్రిక్తుడయ్యాడు. పొండి! ఇక్కడ్నుంచి వెళ్ళిపోండి! ఈ దరిదాపులకు కూడా రావద్దు అంటూ కోపంగా అరిచాడు.

బాబా శిష్యులు కూడా మహారాజ్ కోపాన్నే ఆయన దీవెనలుగా భావించి అక్కడ్నుంచి వెనుతిరిగారు. 200 మైళ్ళు కాలినడకన ఎన్నో ప్రయాసలకోర్చి ప్రయాణించిన వారికి మహారాజ్ అందించే సత్కారం ఇదేనా? అని అనుకున్నారు బాబావారి శిష్యులు.

ఆ పిదప మహారాజ్ శాంతించి బెహ్రాంజీ, గుస్తాద్‌జీ, సదాశివ పటేల్‌లకు మహారాజ్ తన దర్శనం ఇస్తూ, మీరెందుకూ కొరగారన్నారు. నన్నేమో ఈ జైల్లో బంధించారు. మీరు అక్కడికనీ – ఇక్కడికనీ తెగ తిరుగుతున్నారు. మీకు సిగ్గు వుందా? అని ప్రశ్నించారు. మీరిక్కడికి రావడం ద్వారా నాకేదో సహాయం చేసారనుకుంటున్నారు మీరు. ఇక మీ మానాన మీరు వెళ్ళండని కసురుకున్నాడు మహారాజ్. ఆ తర్వాత బాబా శిష్యులు మెహెర్‌బాబా బస చేసిన బబ్లేశ్వర్‌కు తిరిగి వచ్చి, మహారాజ్ సమక్షంలో జరిగినదంతా చెప్పారు.

మహారాజ్ వింత ప్రవర్తనకు సంబంధించిన విషయాల్ని బాబా తన శిష్యులకు వివరించారు. **సద్గురువు ప్రవర్తన అలాగే వుంటుందని బాబా క్లుప్తంగా అన్నారు.**

# గుస్తాద్‌జీ మౌనం

# (1927 మే 1 - 1957)

మే 1927. మెహెరాబాద్‌లోని బాబా వారుంటున్న జోపడీ బయట వున్న వరండాపై గుస్తాద్‌జీకి బస ఏర్పాటు చేశారు. గుస్తాద్‌జీని ఒంటరిగా వుండమని బాబా ఆదేశించారు. మండలివారందరూ కలిసి వుండొద్దన్నారు. గుస్తాద్‌జీకి కేటాయించిన వరండాను కాలకృత్యాలకు మినహాయించి, ఇతర సమయంలో వదిలి వెళ్ళరాదన్నారు. గుస్తాద్‌జీ గొప్ప వాచాలకుడు. గడగడా - గుక్క తిప్పకుండా మాట్లాడతాడు. తాను సాయిబాబా, ఉపాసనీ మహారాజ్, బాబాజాన్‌లతో గడిపిన జీవనాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని కథలు కథలుగా బిగ్గరగా మండలివారితో మాట్లాడుతుండటం బాబాకు నచ్చలేదు.

ఇదిలా వుంటే, ఒకరోజున ఏదో ఒక చిన్న విషయంపై బువాసాహెబ్ - గుస్తాద్‌జీని ఎకసెక్కం చేశాడు. దాంతో గుస్తాద్‌జీ చిర్రెత్తిపోయాడు.

గుస్తాద్‌జీ రెండు గంటలు వీరంగం చేశాడు. తిట్టిన తిట్టు తిట్టలేదన్నట్లు బువాజీని గట్టిగా అరిచినట్లుగా తిట్టాడు.

ఈ హంగామా అంతా గమనించిన మెహెర్‌బాబా విసుగెత్తిపోయారు. దాంతో చివరాఖరకు గుస్తాద్‌జీని మౌనంగా వుండమని ఆదేశించారు. 1927 మే 1 నుండి ఆయన తుదిశ్వాస వదిలేదాకా (1957) గుస్తాద్‌జీ బాబా ఆదేశాల మేరకు మౌనం పాటించాడు. గుస్తాద్‌జీ - బువాజీతో గొడవపడటం కూడా అవతారుని దైవీ ప్రణాళికలోని అంతర్భాగమే. ఒక సందర్భంలో గుస్తాద్‌జీతో బాబా అన్నారు కదా - నా అంతరంగిక కార్యక్రమంలో నీవు చేపట్టిన మౌనం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అందువల్ల నాకోసం నీ మౌనం కొనసాగించమని బాబా హితవు పలికారు.

# గుస్తాద్‌జీ - బాబాతో కాశ్మీర్ పర్యటన

1929లో బాబా కాశ్మీర్‌లో పర్యటించారు.

ఏసుక్రీస్తు దేహాన్ని కాశ్మీర్ రాష్ట్రంలోని హర్వాన్ అనే కొండ గుహలో సమాధి చేశారు. మెహెర్‌బాబా ఈ ప్రదేశంలో కొంత కాలం ఏకాంతవాసం గడిపారు. బాబా బాగా ఇష్టపడే కఫ్నీ కోటు (నల్లని కోటు) ను ధరించి ఏకాంతవాసం ప్రారంభించారు.

బాబా ఏకాంతవాసం వున్న సమయంలో, ఆ జోపడీ బయట కాపలాదారులుగా వుండేందుకు గుస్తాద్‌జీ, బువాసాహెబ్‌లకు మాత్రం బాబా అనుమతించారు. కాశ్మీర్

నుండి తిరిగి వచ్చాక, ఫాల్టాట్ అనే ప్రాంతంలో వున్న నర్మదా నది దగ్గర ప్రేమాశ్రమ విద్యార్థులు బాబాకు స్నానం చేయించారు. ఆ తర్వాత బాబా స్వయంగా గుస్తాద్‌జీకి స్నానం చేయించారు. అవతారమూర్తి చేత స్నానం చేయించబడుతున్న నీవెంత ధన్యుడవో కదా అని గుస్తాద్‌జీని బాబా అభినందించారు.

## గార్ధవ స్వారీ

1939 జూలై 8:

మెహెరాబాద్‌కు తెల్లని గాడిద – దాని పేరు – **చంపా**– ను తీసుకొచ్చారు.

బాబా ఆ గాడిదపై కొద్దిసేపు కూర్చున్నారు.

ఈ గాడిదపై కూర్చునే అవకాశం కల్పించడానికై డా॥ ఘనీని ప్రత్యేకంగా లోనావాలా నుండి బాబా పిలిపించారు. చంపా గాడిద రాకతో మండలివారందరూ చాలా సంతోషించారు.

గుస్తాద్‌జీకి గుర్రపు స్వారీ అంటే చాలా ఇష్టం.

ఐతే బాబా గుస్తాద్‌జీని గార్ధవ స్వారీ చేయమన్నారు.

గుస్తాద్‌జీ అలా గాడిదను ఎక్కాడో లేదో అది వెనక్కు నడవటం ప్రారంభించింది. గుస్తాద్‌జీ ఎంత ప్రయత్నించినా ముందుకెళ్ళకుండా మొండికేసి, ఆ తర్వాత గుస్తాద్‌ని క్రింద పడేసింది.

మండలివారందరూ ముందుగా కాసేపు నవ్వుకున్నా ఆ తర్వాత గుస్తాద్‌జీని లేవదీసి సపరిచర్యలతో సహాయపడ్డారు.

## అంకై గుహల్లో ఏకాంతవాసం

1940 ఆగష్టు.

ఈ నెలలో బాబా మెహెరాబాద్‌లో కఠిన ఏకాంతవాసంలో వుండాలని నిర్ణయించారు. ఈ ఏకాంతవాసం కంటే ముందు తన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా 1940 జూలై 30న గుస్తాద్‌జీని, ప్లీడర్, సేవక్ కొత్వాల్, భాభానంద్, పాపా జెస్సావాలాలతో మన్మాడ్‌కు 10 మైళ్ళ దూరంలో గల అంకై కొండలలో ఏకాంతవాసం పాటించమని ఆదేశించారు.

అంకై కొండలపై అగస్త్య మహాముని కొంతకాలం తపస్సు ఆచరించాడని ప్రతీతి.

పైన చెప్పిన ఆరుగురులో పాపా జెస్సావాలా మినహా అందరూ ఏకాంతవాసం వుండమని బాబా ఆదేశించారు.

పాపా జెస్సావాలాని ఆ బృంద నాయకునిగా బాబా నియమించారు.

అందర్నీ పాపా మాటలు విధేయతతో పాటించమన్నారు.

పాపాజెస్సావాలాను బాబా 'పిస్తల్' **PISTOL** అని పిలిచేవారు.

పాపా జెస్సావాలా ఎవరో తెలుసు కదా! –

బాబా మండలి సభ్యుడైన ఏరుచ్ యొక్క తండ్రి పాపా జెస్సావాలా!!

**Your austerities on the Ankai mountain (cave) will result in your spiritutal progress** అని బాబా అన్నారు.

పాపా జెస్సావాలా క్రమశిక్షణ పేరుతో చాలా కఠినంగా వ్యవహరిస్తాడు.

ఆయన తెల్లవారు ఝామున 4 గంటలకే లేచి,

అందర్నీ లేపేసేవాడు.

అంకై కొండ కోనల్లో తినడానికి ఏమీ దొరకదు. కాబట్టి ప్రతిరోజు మన్మాడ్‌కు పంపేవాడు. దాంతో బాబా మండలి సభ్యులు వారం వారం బాబాకు పంపే సమాచారంలో తామిక్కడ పాపా నేతృత్వంలో పనిచేయలేమని తెలియజేశారు.

పిస్తల్ తమ దరిదాపుల్లో లేకపోతే తాము జీవించినంతకాలం మౌనంగా, తిండి తిప్పలు తినకుండా ఏకాంతవాసం వుంటామన్నారు.

అంకై గుహల్లో పిస్తల్‌తో ఇక ఎంత మాత్రం ఉండలేమని బాబాకు వర్తమానం పంపారు. పిస్తల్‌తో కలిసి మెలిసి ఉండండి.

కనీసం ఏడాది కాలం మౌనంగా గడపమని బాబా కబురు పంపారు.

పిస్తల్ నేతృత్వంలో ఆయన ఆదేశాలు ఇలా పాటించాల్సి వుంది.

తెల్లవారు ఝామున 4 గంటలకు – టీ,

ఉదయం 7 గంటలకు – మధ్యాహ్న భోజనం 'లంచ్',

ఉదయం 10 గంటలకు – మధ్యాహ్నం టీ,

మధ్యాహ్నం 2 గంటలకు – రాత్రి భోజనం (డిన్నర్).

ఈ టైంటేబుల్ నిత్య కృత్యమైంది.

ఈ టైంకు ఎవరు క్షణం ఆలస్యమైనా పిస్టల్ ఊరుకునేవాడు కాదు.

గుస్తాద్‌జీ, ప్లీడర్, సేవక్ అందరూ పాపాపై బాబాకు ఫిర్యాదు చేశారు.

గుస్తాద్‌జీ తన పక్షాన బాబాకు ఒక లేఖను సేవక్ కొత్వాల్ చేత రాయించాడు.

ఆ లేఖలో – డియర్ బాబా – నేను సాయిబాబా, ఉపాసనీ బాబా, బాబాజాన్‌లతో పాటు వున్నాను. ఇప్పుడు నీతో ఉంటున్నాను.

ఐతే నేనింత వరకూ ఎన్నడూ పాపాలాంటి వాడిని చూడలేదు.

ప్రస్తుతం నా పరిస్థితి ఏమంటే నేనైనా పాపాని వదిలేయాలి.

లేదా పాపానైనా మమ్మల్ని వదిలిపెట్టాలి.

మమ్మల్ని పాపా బారి నుండి రక్షించి బయట పడవేయమని బాబాని వేడుకుంటున్నామని గుస్తాద్‌జీ లేఖ రాయించాడు.

దయాళుడైన అవతారుడు అందర్నీ అంకై గుహల నుండి తన వద్దకు వచ్చేయమని కబురు పంపాడు.

# నారాయణ మహారాజ్ దర్శనం

1924 జనవరి మాసం. ఆరోజుల్లో సద్గురు నారాయణ మహారాజ్ ముంబాయిలో వుంటున్నారు. మెహెర్‌బాబా - గుస్తాద్‌జీని ఆయన వెంట కొంతమంది శిష్యుల్ని ఇచ్చి నారాయణ మహారాజ్ దర్శనార్థం పంపారు. గుస్తాద్‌జీని అల్లంత దూరంగా చూస్తూనే - నారాయణ మహారాజ్, ఆయన చుట్టుప్రక్కల వున్న శిష్యులు గౌరవ సూచకంగా లేచి నిలబడ్డారు.

గుస్తాద్‌జీని, మరి ఇతర బాబా శిష్యులను చూసిన వెంటనే నారాయణ మహారాజ్ తన ఆసనం మీద నుంచి లేచి నిల్చోవడమంటే, మెహెర్‌బాబా పట్ల ఆయనకున్న గౌరవానికి సూచిక కదా!!

# మెహెరా దగ్గరున్న బంగారు ఉంగరం

ఇది 1925 నాటి ముచ్చట.

మెహెర్‌బాబా గుస్తాద్‌జీతో కల్సి మెహెరాబాద్‌లో వున్న పోస్టాఫీసు గది దగ్గరకు వచ్చారు. ఆ రోజుల్లో మెహెరా మరి ఇతర బాబా స్త్రీ మండలి పోస్టాఫీసు గదిలోనే నివాసముంటున్నారు.

బాబా ముందుగానే గుస్తాద్‌జీని హెచ్చరించారు.

అదేమంటే, తాము మెహెరా నివాసముంటున్న గది దగ్గరకి వెళ్ళాక, గుస్తాద్‌జీ - మెహెరా దగ్గరకెళ్ళి ఆమె చేతి వ్రేలికి వున్న బంగారు ఉంగరాన్ని తీసుకొచ్చి తనకిమ్మన్నారు.

గుస్తాద్‌జీ బాబా ఆదేశాల మేరకు మెహెరా దగ్గరకెళ్ళి బాబా తనని పంపిన వైనాన్ని పూసగుచ్చినట్లు చెప్పాడు. మెహెరా తక్షణం తన చేతి వేలికున్న ఉంగరాన్ని తీసి ఇవ్వడానికి శతధా ప్రయత్నించింది. మెహెరాతో పాటు ఆమె తల్లి కూడా ఆ ఉంగరాన్ని తీసివ్వాలని ప్రయత్నించారు. చాలాకాలంగా ఆ ఉంగరం ఆమె చేతి వేలికి అలా వుండిపోయిన కారణంగా, ఎన్నిమార్లు ప్రయత్నించినా ఆ ఉంగరం రాలేదు.

సాకోరిలో ఆమె ఉన్నప్పుడు ఉపాసనీ మహారాజ్ ఆ ఉంగరాన్ని మెహెరాకు బహుకరించారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితులలోనూ ఆ ఉంగరం ఆమె చేతి వేలి నుండి తీయొద్దని మహారాజ్ ఆమెను ఆదేశించారు. ఆ కారణంగా చాలా సంవత్సరాలుగా ఆ ఉంగరం మెహెరా శరీరంపై ఒక భాగమయింది.

ఆ దరిమిలా గుస్తాద్‌జీ వెనక్కు వచ్చి జరిగిన విషయాన్ని బాబాకు చెప్పాడు.

ఐతే, నేను ఫలానా వస్తువు తీసుకురమ్మనమని నీకు చెబితే దాన్నెలాగైనా సాధించి తీసుకురావాల్సిందే కానీ మరో ఆలోచన ఏమీ ఉండదని బాబా ఖరాకండీగా గుస్తాద్‌జీతో చెప్పారు.

అలాగే, గుస్తాద్‌జీని మరో క్రొత్త ఉంగరం మెహెరాకి తానిస్తానని బాబా చెప్పమన్నారు. ఏమి చేసేది పాలుపోక గుస్తాద్‌జీ తిరిగి మెహెరా దగ్గరకు వెళ్ళాడు. అంతక్రితం నుంచి ఆమె పడిన శ్రమ వల్లనో ఏమో, ఆమె చేతి వేలికున్న ఉంగరం బయటకొచ్చింది. దాన్ని ఆమె సంతోషంగా గుస్తాద్‌జీకి ఇచ్చింది.

గుస్తాద్‌జీ ఆ ఉంగరాన్ని భద్రంగా తీసుకొచ్చి బాబాకు అందజేశాడు. ఆ దరిమిలా హృదయాకారంలో మరో బంగారు ఉంగరాన్ని బాబా తయారు చేయించి ఆ ఉంగరంపై మెహెర్ అని ఇంగ్లీషు అక్షరాలు చెక్కించి మెహెరా వ్రేలికి మెహెర్‌బాబా స్వయంగా తొడిగారు. మరెన్నడూ ఆ ఉంగరాన్ని చేతినుండి తీయొద్దని బాబా ఆమెని ఆదేశించారు.

# ఓ మెహెర్‌బాబా...

**రచన: బండవరం రంగనాథస్వామి.**
**మంచిర్యాల**

ఓ..... మెహెరుబాబా ॥ 2 ॥

1. తల్లి... శీరీను భానూ
తండ్రి... శెరియార్జిగానూ...
పునాలోన పుట్టితివిరా.. మెహేరుబాబా...
మేర్వానుగా... వెల్సితీవిరా...మెహేరుబాబా...
ఓ.....మెహేరుబాబా... ॥ 2 ॥

2. ఇరువదైదు ఫిబ్రవరీ
తొంబది నాలుగు ఏడు నాడూ...
సస్సూ...న్ దవాఖాన జన్మమిచ్చెరా... మెహేరుబాబా.....
విషా...ద మంతయు తొల్గిపోయెరా... మెహేరుబాబా......
ఓ..... మెహేరుబాబా... ॥ 2 ॥

3. మణీజా... నీ... చెల్లెలాయె
మెహెరా యేమొ ప్రేమ పంచె
శిష్యులను చేర్చుకుంటివీ... మెహేరుబాబా......
తపస్సులను వీడ మంటివీ... మెహేరుబాబా.....
ఓ మెహేరుబాబా... ॥ 2 ॥

# సర్వధర్మాన్ పరిత్యజ్య...




శ్రీ కేశవ్ నారాయణ్ నిగం హమీర్‌పూర్ జిల్లాకు చెందిన బాబా ప్రేమికుడు. మెహెర్‌బాబా ఆదేశాల మేరకు శ్రీ కేశవ్ నారాయణ్ నిగం తన జీవిత చరిత్రను ఇంగ్లీషులో **మై లైఫ్ స్టోరీ విత్ అవతార్ మెహెర్‌బాబా** పేరుతో 1960వ దశకంలోనే గ్రంధస్తం చేశారు. ఆ రాసిన చిత్తు ప్రతిని ఆయన బాబాకు చూపించారు కూడా. ఇంగ్లీషులో వున్న ఈ పుస్తకాన్ని తెలుగులో **సర్వధర్మాన్ పరిత్యజ్య** శీర్షికతో మెహెర్‌బాబా పత్రిక తరపున ప్రచురించి 2012 జూన్‌లో విడుదల చేయడమైంది.

కేశవ్ నారాయణ్ నిగం తన జీవితాన్ని బాబా పాదాల చెంత అంకితం చేశారు.

శ్రీ నిగం గొప్ప మేధావి. ఆయన స్వాతంత్ర సమర యోధుడిగా జైలుశిక్ష అనుభవించాడు. హమీర్‌పూర్‌లో గొప్ప సంఘసేవకుడిగా, అడ్వకేటుగా, కీర్తిగడించాడు.

రాష్ట్ర సమాచార శాఖ డైరక్టర్‌గా పనిచేశాడు. జిల్లా పరిషత్ బోర్డు సెక్రటరీగా నిజాయితీగా తన సేవలు అందజేశాడు. ఆ దరిమిలా మెహెర్‌బాబా ఆయన్ని ఒక అరుదైన లెటర్ ఆఫ్ అపాయింట్‌మెంట్‌తో హమీర్‌పూర్ జిల్లాలో బాబా సేవలో తన కార్యకర్తగా నియమించి నెలకు జీతంగా రూ.350 చొప్పున ఇచ్చారు. ఆయన హిందీలో వెలువడుతున్న పుకార్ పత్రికకు సంస్థాపక సంపాదకుడు. ఆ నియామకం కూడా మెహెర్‌బాబానే స్వయంగా చేశారు. మెహెర్‌బాబా నవజీవనంలో ఉన్నప్పుడు ఆ కార్యక్రమంలో పాల్గొనలేకపోయానేనన్న వ్యధతో, అవతారుని దర్శనం లభించడంలేదేనన్న విరహంతో 40 పాదాల పద్యాలు **మెహెర్ చాలీసాను** రాసి ఆలాపిస్తూ గడిపారు. ఈ గీతాలను బాబావారు స్వయంగా 10 సార్లుకు పైగా కేశవ్‌జీని అడిగి పాడించుకున్నారు. తన హృదయాన్ని దోచిన గీతమాలిక **మెహెర్ చాలీసా** అని మెచ్చుకోలుగా బాబా కేశవ్‌జీని పలుమార్లు అభినందించారు.మేను పులకరింపజేసే అనేక వాస్తవ జీవిత సంఘటనలు ఈ రచనలో కనిపిస్తాయి. కేశవ్‌జీ తన జీవితంలో అనుభవించిన అనేక ఉద్ధాన పతనాలను ఆసాంతం చదివిన పాఠకులు ప్రతి పదంలో తమ కళ్ళలో నీళ్ళు చిప్పరిల్లాయని చెప్పారు. బాబా ప్రేమికులందరికీ కేశవ్‌జీ ఆదర్శం. ప్రతిఒక్కరూ తప్పక చదవాల్సిన గ్రంధం, ప్రతి ఇంటా ఉండాల్సిన పుస్తకం..**సర్వధర్మాన్ పరిత్యజ్య.. వెల..రూ. 50. ప్రాప్తిస్థానం..కేరాఫ్ ఎడిటర్, మెహెర్‌బాబా మాస పత్రిక.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

***(గత సంచిక తరువాయి)***

డిసెంబరు 28వ తేదీన ఓ గమ్మత్తు జరిగింది. సూర్యాస్తమవుతోంది అప్పుడు. బాబావారు తమ గొయ్యిగది దగ్గర కూర్చొన్నారు. మండలివారు ఆయన చుట్టూ చేరారు. ఎప్పటిలా బాబావారు మాట్లాడుతున్నారు. మండలివారు శ్రద్ధగా వింటున్నారు. ఇంతలో ఓ కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి, బాబావారి మెడలో గులాబీ దండ వేసి, ప్రక్కనే నిలబడ్డాడు. వాడిలో కించిత్ గర్వం కనిపిస్తోంది. చూశారా! మీరెవ్వరూ చేయలేని పని నేను చేశాను అన్నట్లు చిరునవ్వు చిందిస్తున్నాడు. బాబా సన్నిధిలో నన్నెవరూ ఏమీ చేయలేరన్న ధీమా కన్పిస్తోంది ఆ కుర్రాడిలో. బొంబాయి నుంచి కాలినడకన వచ్చాడు. బొంబాయి ఏమన్నా దగ్గరా ఏమన్నానా? రెండు వందల మైళ్ళ దూరం. కడుపుకి తిండి లేదు. కంటికి నిద్ర లేదు. దాహంతో గొంతు ఎండిపోతోంది. అయినా ధైర్యంగా ఒంటరిగా వచ్చేశాడు. కష్టమైనా ఇష్టమేనని వచ్చి చేరితినయ్యా, నన్ను బ్రోవ వయ్యా అని బాబావారికి చెప్తున్నాడా అనిపించింది వాడి తీరు చూస్తున్న వారికి. ఇంతకీ ఈ కుర్రాడి పేరు చెప్పలేదు కదా. వాడు ఎక్కడి వాడో కూడా మాటవరసకైనా అనలేదు కదూ! పొరపాటయింది పాఠకమహాశయా! పొరపాటయింది. ఈ కుర్రాడు మన ఆఘూ ఆలీ నేస్తం. వీడి పేరు అహమ్మద్ మహమ్మద్. ఇద్దరూ ప్రేమాశ్రమం గోపికలు. టోకా నుంచి ఆఘూని పంపేసినప్పుడే, అహమ్మద్‌ని కూడా వాడి ఇంటికి పంపేశారు. మెహెరాబాద్‌లో మళ్ళీ స్థిరపడ్డాక పిలుస్తానని బాబావారు హామి ఇచ్చారు ఆ ఇద్దరికీ.

"నిన్ను విడిచి వుండలేనయా" అంటూ అఘూ ఆలీ డిసెంబరు 14న బాబా గూటిలో వాలాడు. వాడిలాగా ఇంటికి పంపబడిన గోపికలు మరి కొందరు కూడా అమ్మా నాన్నలకి కళ్ళు కప్పి, మెహెరాబాద్ చేరారీ మధ్య. వీళ్ళ రాక గురించి అహమ్మద్ వినలేదు కానీ, బాబాని వదలి ఇంటి దగ్గర వుండలేక రోడ్డున పడ్డాడు. మెహెర్‌ని చేరాడు. వీడి రాకతో ప్రభువు సంతోషించారు.

**ప్రభుని విడిచి పిల్ల గోపికలు వుండలేవు. పిల్ల గోపికలని విడిచి ప్రభువు వుండలేరు. ఇదొక అనిర్వచనీయమైన బంధం. అదొక అవినాభావ సంబంధం. దీపం చుట్టూ చేరతాయి చిమటలు. దీపపు కాంతి ఎంత దూరం కన్పించినా అవి దీపం దగ్గరకి ఎగురుతూ వస్తాయి.**

**ఆనందంతో దీపం చుట్టూ గిరగిరా తిరుగుతాయి. క్షణమయినా నిలకడగా వుండవు. శరత్ కాలంలో పురివిప్పి నాట్యం చేస్తున్న నెమలిలాగా, దీపం ముందు ఆనందంతో గెంతులు వేస్తాయి. మంచి లోకంలో తేలిపోతాయి. దీపం దగ్గరకి చేరటానికి, దీపపు వెలుతురులో మెరిసిపోడానికీ అవి పడుతున్న తాపత్రయం, శ్రమ చూస్తుంటే అమ్మో! ఇంతకంటే ఏ ఉన్నత పర్వత శిఖరానైనా ఎక్కడం తేలిక అనిపిస్తుంది. దీపం దగ్గరకి వెడితే అంటుకొని, కాలిపోతామని తెలీదా చిమటలకి. ఎందుకు తెలీదు. ఈ నగ్న సత్యం చిమటకి తెలుసు. కానీ అవి కోరుకొనే వరమదే కదా. దీపపు వెలుతురులో ముందుకుసాగాలి. దీపపు మంటకి ఆహుతి కావాలి. బూడిదయిపోవాలి. అలా మాయని జయించి ప్రభు పంచన చేరాలి. ఇదేగా దీపపు శలభాలు కోరుతున్నది.**

ఆఘూ, అహమ్మద్ వంటి ప్రేమాశ్రమపు గోపికల కోరిక ఇదే కదా. అందుకనే కదా ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రభు నీడ వదలమని వీరు భీషణ ప్రతిజ్ఞ చేసింది.

మెహెరీశుని దివ్యనామం వాళ్ళకి వూపిరి. మెహెరీశ్వరుడే వాళ్ళ ఆరాధ్య దైవం, వాళ్ళని ఆకర్షించే దీపం. పువ్వు చుట్టూ ఎగిరినంత మాత్రాన భ్రమరానికి తేనె దొరకదు. ప్రకృతి వరమయినా సమయం రావాలి ఆ అదృష్టానికి కూడా. అలానే బాబా దీపం చుట్టూ ఎగిరే చిమటలకి కాలి మసయిపోవాలన్న ఓపిక పట్టక తప్పదు. పిలిస్తే పలికే దైవమయినా ప్రభువు మెప్పు ఓ పట్టాన దొరకదు. సీతమ్మకు చేయిస్తే చింతాకు పతకము, రామచంద్ర అంటూ గొంతెత్తి ప్రభువుకి గుర్తుచేసిన భద్రాద్రి గోపన్నకే తప్పలేదు నిరీక్షణ.

అందుకనే అంటాడు కవి దివ్య ప్రియతముని ఇచ్ఛకి ఎవరైనా తలవొగ్గ వలసిందేనని.

పరంధాముడి ఇచ్ఛ ప్రకారం వుండేదే నిజమైన ప్రేమ అనీ, అటు చిమటలకీ, ఇటు ప్రేమాశ్రపు గోపికలకీ అలనాడు గోపన్నకీ ఈ సత్యం తెలిసింది.

సజీవంగా వుంటూనే పరమాత్ముడిలో కలిసిపోగల మహత్తర శక్తి దీపపు పురుగులది. అది ఎంత అదృష్టమో కదూ! దొరుకునా అందరికీ ఇటువంటి సేవ అన్నది ఇందుకోసమే.

డిసెంబరు 30వ తేదీన మరొక సృష్టి చిత్రం వివరించారు. బుర్రకి పదునుపెట్టే సంగతి అది. ఎందుకంటే, భూమి గిరగిరా తిరుగుతూ వుంటే, మరి భూమి మీద వున్న మనమంతా గిరగిరా తిరుగుతుండాలి కదా. ఆ వేగానికి గుండె దడదడా కొట్టుకోవాలి. భూమి మీద మనుష్యులం ఒక్కళ్ళమేనా! ఎన్నో చరాచర జీవరాసులున్నాయి. ఎన్నో కొన్ని వేల లక్షల వస్తువులున్నాయి. మరి వాటి సంగతి ఏమిటి? అవి గిరగిరా తిరుగుతున్నాయా? లేక భూమి దారి భూమిదే, మన దారి మనదే.

ఇవన్నీ చిక్కు ప్రశ్నలు. శాస్త్రవేత్తల పరీక్షలోని విషయాలు. ఆ! మనకెందుకు వీటి వైనం మనమేమయినా ఆర్చే వాళ్ళమా తీర్చేవాళ్ళమా అనుకోవటం, నిస్పృహలో పడటం చేస్తారు చాలామంది.

కానీ మన కళ్ళకి కన్పిస్తూ కూడా అర్థం కాని ఈ సృష్టి విచిత్రాన్ని తెలుసుకోవాలనివుందా! అయితే వినండి బాబావారు ఏం చెప్పారో ఆ వేళ.

భూమి గుండ్రంగా తిరుగుతుంది. నిలకడగా తిరగటంలేదు. చాలా స్పీడుగా తిరుగుతోంది భూమి. ఆ వేగం ఇంతా అంతా కాదు. మరి అంత వేగంగా భూమి కదుల్తూంటే, గిరగిరా తిరుగుతోందా భూమి అని అడిగారనుకోండి. అవునూ, అని కానీ, కాదు అని కానీ చెప్పటం కష్టం.

ఇదే కష్టమనుకొంటే, దీన్ని మించిన మరో కష్టం వుంది. దానిమాట ఏమంటారు అని ప్రశ్నించారు బాబావారు. ఆ కష్టమేమిటో వివరించారు చాలా ఓపికగా. భూమిపై వున్న ప్రతిజీవి ఎప్పుడూ ఏదోఒకటి ఆలోచిస్తూ బుర్రపాడుచేసుకొంటుంది. నిముషానికి కొన్ని వందల ఆలోచనలు బుర్రను తొలిచేస్తాయి. మరి మానవాళికి వచ్చే ఆలోచనల్ని, ఇతర ప్రాణికోటి చేసే ఆలోచనల్ని కనుక కలిపి కూడితే వచ్చే మొత్తం సంఖ్య, అదే ఈ భూమిపై జీవరాశి ఆలోచనల సంఖ్య – ఎంత వుంటుందంటారు అని బాబావారు నవ్వుతూ అడిగారు. ఆ నవ్వులో కొంత చిలిపితనం, కొంత కొంటెతనం వున్నాయి.

వింటున్నవారికి నిజంగానే బుర్ర తిరిగింది. ఇదేమి లెక్క! ఈ కూడికలు ఎవరు చేస్తారు? ఈ ప్రశ్నలకి బాబావారే జవాబిచ్చారు. చిక్కులని విప్పడానికే వచ్చిన బాబావారు చెంతన వుండగా చిక్కుముడి గురించి బెంగ ఎందుకు అన్నాడొక కవి. నిజమే కదా. ఇంతకీ బాబావారేమి చెప్పారంటే, అటు మనుషుల, ఇటు ఇతర ప్రాణరాశుల ఆలోచనల్ని ఎవరూ కొలవలేరన్నారు. ఒకవేళ లెక్కపెట్టాలనుకొన్నా సాధ్యం కాదన్నారు. అందని సంఖ్య అది అన్నారు. ఆలోచనల సంఖ్య లెక్కపెట్టలేక పోయినా, వాటి వేగాన్ని అయినా కొలవగలమా? అబ్బే, అదీ సాధ్యం కాదన్నారు. మహావేగంతో పరుగెడతాయి ఆలోచనలు. అవి కొలబద్దకు అందవన్నారు. కదలకుండా నిశ్చలంగా వున్నట్లు వుంటాయి. ఇది కేవలం భావన మాత్రమేనన్నారు. చరాచర జగత్తులో అందరికీ, అన్నింటికీ నాడి వుంది. జగత్తు నాడి ఇలా వుందని ఎవరికీ అంతుచిక్కదు. నాకయితే జగత్తు నాడి అందుతుంది అని అన్నారు బాబా.

జగత్తు నాడిని నేను పట్టుకోగలను. జగత్తు నాడి ఎలా కొట్టుకుంటుందీ చూడగలను. జనం నాడి రేపు ఎలా వుండాలో, ఎలా వుంటుందో కూడా నాకు తెలుసు అన్నారు.

అమెరికా రాష్ట్రపతి ఈవేళ ఏం ఆలోచిస్తున్నారో నాకు తెలుసు. రేపు ఏం ఆలోచిస్తారో కూడా నాకు తెలుసు. బ్రిటీషు ప్రధాని ఏమనుకొంటున్నాడో నాకు తెలుసు. ఒకమాట చెప్పనా! వాళ్ళు – అదే అమెరికా రాష్ట్రపతి, బ్రిటీషు ప్రధాని ఆలోచనలు తెలుసుకోడానికి ఒక్కక్షణం చాలు నాకు. విస్తుపోతున్నారు కదూ! ఇది ఎలా సాధ్యమని అనుకొంటున్నారా? ఎక్కడో అమెరికాలో వున్న అమెరికా రాష్ట్రపతి ఆలోచనలు ఇక్కడ మెహెరాబాద్‌లో వున్న నాకెలా తెలుస్తాయని ఆశ్చర్యపడవచ్చు మీరు. ఇవి అన్నీ తెలుస్తాయి. ఎందుకంటే ఇవి

అన్నీ, అంటే ఈ అమెరికా, ఈ బ్రిటన్ అన్నీ నాకు దగ్గర, నా ప్రక్కనే వున్నాయి. ఇదిగో ఈ వసంత్ సంగతి తీసుకోండి. చేతిమీద, బుగ్గమీద, పొట్టమీద ఎక్కడో అక్కడ నేను గిల్లాననుకోండి ఏమవుతుంది? వాడు ముసిముసి నవ్వులు నవ్వుతాడు. ఎందుకని? చేయి, బుగ్గ, పొట్ట – వాడి శరీరంలో భాగాలు. అందుకనే చేయిపై గిల్లినా, బుగ్గపై గిల్లినా వాడికి తెలుస్తోంది వెంటనే. మరి ఏదో బుగ్గమీదో, పొట్టమీదో కాకుండా, ఎక్కడ పడితే అక్కడ ఒక్కసారి చక్కిలిగింతలు పెడితే, గిల్లితే? వసంతుడు నిలకడగా నిలబడలేడు సరికదా! మెలికలు తిరిగిపోతాడు. కాలు, చేయి, బుగ్గ ఎలా అయితే వసంత్‌ని అంటిపెట్టుకున్నాయో, విశ్వం యావత్తూ నన్ను అతుక్కుని వుంది. నాలో ఒక భాగం ఈ జగత్తు అంతా.

ప్రతి ప్రాణి ఆలోచనలు నాకు తెలుసు. సృష్టిలోని ప్రతి వస్తువు గురించీ తెలుసు. అలానే చరాచర జీవుల మనస్సు అర్ధమవుతుంది నాకు. ఎందుకంటే జగత్తుని నా ఛాతీకి గట్టిగా బిగించి కట్టాను కాబట్టి. ఎవరు ఏం అనుకొన్నా, ఏం ఆలోచించినా నాకు ఇట్టే తెలుస్తుంది. సృష్టి గుండెచప్పుడు క్షణం క్షణం నాకు వినిపిస్తుంటుంది అని బాబావారు శెలవిచ్చారు.

**సాథా గుండె దడ:**

అందరి గుండె చప్పుడు వింటున్న బాబావారికి నౌసర్వాన్ సాథా గుండె చప్పుడు వినపడటం లేదా? ఇదొక ధర్మ సందేహం! మరి ఆ సందేహ నివృత్తి చేయగలది ఒక్కరే ఒక్కరు. అది శ్రీ మెహెర్ బాబావారు. కానీ ప్రభువు పెదవి కదపలేదు. సాథాకి విసుగు, చిరాకు ఎక్కువవుతున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే, అక్బర్ ప్రెస్ భవన యజమానికి నిస్త్రాణ పెరుగుతోంది రోజు రోజుకీ.

ఇంతకీ ఏమయిందంటే, పాఠక మహాశయా, మీకు తెలుసుగా మెరిడిత్‌స్టార్ దొర గారు, ఆయన భార్య, మరదలు, అక్బర్ ప్రెస్‌లో వుంటున్నారు. టోకా నుంచి వచ్చేసాక. మొదట్లో బాగానే వుండేవాడు దొర గారు. రానురాను ధోరణి మారింది. ఎప్పుడూ ఇది కావాలి, అది కావాలి అని అడగటమే అతని పనిలా కన్పిస్తోంది. తిండికి వంకలు పెట్టేవాడు. బత్తాయిలు, నిమ్మరసం కావాలనేవాడు. తనవి గొంతెమ్మ కోర్కెలా, తన కోర్కెల పేరు చెప్పి ఎదుటివాళ్ళు ఇబ్బంది పడుతున్నారాన్న ధ్యాస ఏమాత్రం లేదా మనిషికి. నౌసర్వాన్ సాథా ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. దొరగారి గొంతెమ్మ కోర్కెలు తీర్చలేక సతమతమవుతున్నాడు. ఏం చేయాలో పాలుపోవటం లేదు. నువ్వే కాదు నాకెవరయినా ఒక్కటే, ఎవరయినా సరే నేను చెప్పినట్లు చేయాల్సిందే అన్న ధోరణి దొరగారికి ఎక్కువవుతోంది రోజు రోజుకీ. ఎందుకంటే, సాథానే కాక పెద్ద ఆదీని కూడా సతాయించడం మొదలెట్టాడు. దొర గారి అసలు రంగు భార్యపేరు చెప్పి బయటపడింది. మెరెడిత్ గారి భార్య మార్గరెట్ మంచి ఇల్లాలు. ఆమెకు సుస్తీ చేసింది. పూనాలో వైద్యం

చేయిద్దామనుకొన్నారు. రైలులో పూనా తీసుకువెళ్ళి, ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఏర్పాట్లన్నీ పెద్ద ఆదీ చేశాడు. దీనిపై ఎంత రాద్ధాంతం జరిగిందని! దొరగారు భార్య కదా, నా కారులో తీసుకువెడతాను ఆవిడని పూనాకి అన్నాడు ఆదీ. అగ్గి గుగ్గిలమయ్యాడు దొరగారు. అనారోగ్యంతో వున్న మనిషిని కారులో తీసుకువెడతావా! ఈ గతుకుల రోడ్డులో వొళ్ళు హూనం అయి రోగం పెరుగుతుంది. మా ఆవిడని రైల్లో తీసుకువెళ్ళాల్సిందేనన్నాడు. మార్గరెట్‌తో నా మరదలు ఎస్థర్‌ని కూడా పంపాల్సిందే. ఆస్పత్రిలో తోడు వుంటుందని పట్టుపట్టాడు. పెద్ద ఆదీ కాదనలేదు.

దొరగారు అడిగినట్లు చేశాడు. గ్మమత్తు ఏమంటే, ఈ సంభాషణలు ముఖాముఖీ జరిగితే ఓ రకంగా వుంటుంది. దొరగారికి అది అలవాటు లేదు. అందుకని ఆయన ఏమాట చెప్పాలన్నా చీటీ రాసి పంపేవాడు. మార్గరెట్ పూనా యాత్ర విషయంలోనూ ఇంతే చేశాడు. డిసెంబరు 7వ తేదీన జరిగిన ఈ సంఘటనతో అందరికీ మనస్సు చివుక్కుమంది. ఈ మహానుభావుడి పేరుచెప్పి ఆదీ ఎంత ఇబ్బంది పడుతున్నాడో. ఎంత డబ్బు ఖర్చు అవుతుందో. అయినా సరే దొర గారికి ఏమీ పట్టటం లేదు. ఇది ఏమీ బాగాలేదనుకొన్నారు. మెరిడిత్ స్టార్‌ని రమ్మని పిలిచింది బాబా గారే. రానూ పోనూ ఖర్చులు, ఇక్కడ వుండటానికి అవుతున్న ఖర్చు బాబావారే భరిస్తున్నారు. ఇంతకీ దొర గారు ఎందుకు వచ్చారు ఇక్కడికి? మెహెరాశ్రమం స్కూలుకి పిల్లల్ని తీసుకువస్తానంటే రమ్మన్నారు. ఆ పని చేయలేదు. అయినా ఏదో లోటు వుందని వీడించడం బాగాలేదనిపించింది చూసేవాళ్ళకి. ఈ దొరగారిది పెద్దమనస్సు కాదు. ఈయనది చిన్న బుద్ధి అనుకొన్నారు.

పరిస్థితి శృతిమీరుతుండటంతో బాబావారు కల్పించుకొన్నారు. పెద్ద ఆదీ, రుస్తుం, నౌసర్వాన్‌లని పిలిచి ఏం చేద్దామంటారని అడిగారు. ఏముంది, ఆయన్ని వెనక్కి పంపేస్తే మంచిది అన్నారు వాళ్ళు. తిరుగు ప్రయాణం టిక్కెట్టు ఇద్దామన్నారు. బాబావారందుకు ఒప్పుకోలేదు. మెరిడిత్ ద్వారా చేయాల్సిన ఆధ్యాత్మిక పని ఇంకా వుంది. ఆ పని అయ్యే వరకు అతగాడిని ఏదో రకంగా బుజ్జగించాలి. ఇప్పుడే తెగతెంపులు చేసుకొంటే, ఆ పని ఆగిపోతుంది. మరి ఏం చేయాలి? బాబావారు ఏం చేశారు?

బాబావారు ఏం చేశారో తెలుసుకోవాలని ఆత్రంగా వుందా పాఠకమహాశయా!

అయితే వినండి.

మెరిడిత్ స్టార్‌ని తిట్టలేదు. చివాట్లు పెట్టలేదు. కనీసం నువ్వు నా వాళ్ళని విసిగిస్తున్నావయ్యా, ఇది బాగాలేదనీ అనలేదు.

దొర గారిని పొగిడారు. దైవచింతన పెరిగింది. ఇక్కడికి వచ్చాక, ఆధ్యాత్మికంగా బాగా ఎదిగావని శహభాష్ చెప్పారు. నువ్వు ఇక్కడే వుండు. నీతో వచ్చిన ఇద్దరు స్త్రీలు – భార్య, మరదలు ఇక్కడే వుండవచ్చు. తమకి అభ్యంతరం లేదన్నారు.

ఓ చిన్న చిక్కువుంది. చిక్కు అంటే చిక్కుకాదనుకో అది పెద్ద గండం, ప్రాణ గండం. ఇక్కడే వుంటే నీవు చనిపోతావు. నీ ఆడవాళ్ళకయినా చావు తప్పదు. నీ చావుని నేను తప్పించగలను అనుకో. కానీ విధిరాతతో నేను జోక్యం చేసుకోకూడదు, అదీ ప్రస్తుత సమయంలో చావు తప్పించుకోవాలంటే ఓ ఉపాయం వుంది. వెంటనే మీ దేశానికి వెళ్ళిపో. అక్కడ నీకు ప్రాణ భయం లేదు అని బాబావారు అన్నారు.

ముఖాముఖీ కాదు సుమా.

డిసెంబరు 10వ తేదీన పంపేరు ఆదేశాన్ని. ఆ లేఖలో ఇలా వ్రాశారు.

మెరిడిత్! నేను కొద్ది రోజులుగా ఓ ప్రధానమైన ఆధ్యాత్మిక కార్యక్రమం చేస్తున్నాను. నువ్వు వెంటనే ఇంగ్లాండు వాపసు వెళ్ళాలి. తప్పదు నీకీ ప్రయాణం యిప్పుడు. ఇక్కడే ఇండియాలో వుంటే చచ్చిపోతావు నువ్వు. నీతో వచ్చిన ఇద్దరు ఆడవాళ్ళు బ్రతుకుతారు. నీకు చావు తప్పదు. ఆధ్యాత్మికంగా బాగా ఎదిగావు కాబట్టి నీకు చావు తధ్యం. నువ్వు ఇండియాలోనే వుంటే, నువ్వు కానీ మీ ఆడవాళ్ళు కానీ ఎవరో ఒకరికి మృత్యువు తప్పదు. మరి నేను జోక్యం చేసుకోవటం భావ్యం కాదీ సమయంలో. ఇంగ్లాండుకి బయలుదేరటమే సబబు. నువ్వు అక్కడ ఇంగ్లాండులో వుండటమే మంచిది. అవసరం కూడా ప్రస్తుత సమయంలో. నా కోసం నీవు చేయాల్సిన పని చాలా వుంది. అక్కడ నీకు పేదవాళ్ళంటే ఇష్టం. వాళ్ళకోసం పనిచేస్తావు. పేదలపాలిటి పెన్నిధివి నీవు. కాబట్టి ఓ పనిచేయి. బొంబాయికి రైల్లో వెళ్ళు. మామూలు ప్రయాణీకుడిలా సామాన్యుల మధ్య కూర్చొని బొంబాయికి రైలులో వెళ్ళు. దారిలో మాట్లాడకు. మౌనంగా వుండు ఇప్పటినుంచీ. ఇంగ్లాండులో అడుగుపెట్టే వరకూ పెదవి విప్పకు. అక్కడికి వెళ్ళాకే మౌనం విరమించు అని బాబావారు తమ సందేశ పత్రంలో వ్రాశారు.

డిసెంబరు 10న పంపారీ లేఖ అని చెప్పుకున్నాం కదా.

మర్నాడు అంటే డిసెంబరు 11న ఛగన్‌తో ఇంకో కబురు పంపారు.

నలుగురితో పిచ్చాపాటీ మాట్లాడుతున్నా, ఏదైనా లావాదేవాలు చేస్తున్నా బాబావారి పేరు ప్రస్తావించకూడదు. అలాగే చందాలు వసూలుచేస్తుంటే, బాబావారి పేరు చెప్పి డబ్బులు వసూలు చేయకూడదు. ఆధ్యాత్మిక విషయాలు ప్రస్తావిస్తుంటే మాత్రం బాబావారి నామస్మరణ చేయవచ్చు. బాబావారి గురించీ మాట్లాడవచ్చు. ఆధ్యాత్మిక విషయాల్లో బాబావారెప్పుడూ అతని వెంట వుంటారు. సహాయం చేస్తారు. ఇదీ ఛగన్ తెచ్చిన కబురు. ఈ కబురు చెప్పి, ఓ చీటీ ఇచ్చాడు. బాబావారు నీకు ఇమ్మన్నారు అన్నాడు. ఏం వ్రాశారో బాబావారని ఆత్రంగా చీటీ విప్పారు దొర గారు. ఆ సందేశం చదువుతూనే కంగారుపడ్డాడు. వెంటనే నేను వెళ్ళిపోవాలి. నా ప్రయాణానికి ఏర్పాట్లుచేయండి అని ఛగన్‌తో గాబరాగా అన్నాడు. ఇంతకీ అంతగా కంగారుపెట్టే వార్త ఏముంది ఆ చీటీలో.

"మెరిడిత్! వెంటనే వెంటనే బయలుదేరు. నీ ఇద్దరు ఆడవాళ్ళనీ వెంట తీసుకువెళ్ళు.

ఇది చాలా అవసరం. వెళ్ళకపోతే శరీరం వదిలేస్తావు".

బాబావారి సందేశం దొరగారిని కుదిపేసింది. చలి జ్వరం వచ్చిన మనిషిలా వణికిపోయాడు. దొరగారికి ఏమయిందో అర్థం కాక ఛగన్ బుర్ర గోక్కున్నాడు. ఏదయితే అయిందని మీరడిగినట్లు ప్రయాణం ఏర్పాట్లు చేస్తామని ఛగన్ హామీ యిచ్చాడు. ఏర్పాట్లు చకచకా జరిగాయి. బొంబాయి నుంచి లండన్ వెళ్ళే ఓడలో మెడిడిత్ స్టార్ త్రయానికి చోటు దొరికింది.

డిసెంబరు 29వ తేదీ మధ్యాహ్నం దొరగారు మెహెరాబాద్‌కు వచ్చి బాబావారికి వెళ్తున్నానని చెప్పాడు. మంచిది అన్నారు బాబా. వెంటనే బొంబాయికి బయలుదేరాడు. అక్కడ వో నాలుగురోజులున్నాక అంటే జనవరి 2వ తేదీన ఓడ ఎక్కాడు. భార్య మార్గరెట్, మరదలు ఎస్థర్ కూడా ఓడ ఎక్కారు. అలా వాళ్ళ ఆర్నెల్ల మెహెర్ యాత్ర పూర్తయింది. నౌసర్వాన్ సాథా హమ్మయ్య అని ఊపిరితీసుకొన్నాడు. భలే మందు వేశారు బాబా దొరగారికి అని రుస్తుం అంటుంటే, పెద్ద ఆదీ ఎప్పటిలా చిరునవ్వుల జల్లు కురిపించాడు.

**కొత్త సంవత్సరం - కొత్త సమస్యలు:**

కొత్త సంవత్సరం 1929 మొదలయింది. కొత్త సమస్యలు తెచ్చింది. మొదటిరోజునే అంటే జనవరి ఒకటవ తేదీనే ఈ సంగతి స్పష్టమయింది. అదీ బువాసాహెబ్ పుణ్యమా అని ఖర్చు పెరిగింది. బాబా మండలిలో చాలామంది చేరారీ మధ్యన. వాళ్ళకి చేతినిండా పనిలేదు. తిని కూర్చుంటున్నారు. మన ఖర్చు తగ్గాలీ అంటే ఒక్కటే మార్గం. పనీ పాటా లేనివాళ్ళ సంఖ్యని తగ్గించాలి అన్నాడు.

తన సలహాకి బాబావారు ఎలా స్పందిస్తారోనని ఒదిగి ఒదిగి నిలబడ్డాడు. బాబావారు అతని ప్రతిపాదనకి అవును అనలేదు. కాదు వద్దులే అనలేదు. ఆచితూచి స్పందించారా అంటే అదీ చేయలేదు. ఎప్పటిలా తమదైన శైలిలోనే మాట్లాడారు. బాబావారి శైలి అంటే తెలుసుగా కొన్నిసార్లు తమకొక్కరికే అర్థమయ్యే భాషలో మాట్లాడుతారు. ఆ మాటల్ని వర్తమానానికో, భవిష్యత్‌కో అన్వయించుకోవటం కొంచెం తొందరపాటు అవుతుంది. ఇదీ అందరికీ తెలిసిన సత్యమే. బువా సాహెబ్‌గారికీ తెలుసు ఈ సంగతి.

ఇంతకీ బాబావారు ఏమన్నారు. ఖర్చు గురించి బాధపడకన్నారు. అన్నీ చక్కబడతాయి అన్నారు. నిరుడు ప్రేమాశ్రమం పిల్లలు బోరుమన్నారు. ఈ ఏడాది కళ్ళనీళ్ళు పెట్టుకోవటం మనవంతు అవుతుంది అన్నారు.

ఇలా అన్న కాసేపటికే బాబావారు స్కూలు మూసేస్తానని చూచాయిగా చెప్పారు. ఆలస్యం ఎందుకు అనుకొన్నారో ఏమో, మర్నాడే తొమ్మిది మంది పిల్లల్ని వాళ్ళ ఇళ్ళకి పంపేశారు.

రుస్తుం కుటుంబంతో సహా నాసిక్‌కి మారాడు. అతని కొత్త ఇంటిలో స్త్రీ మండలికి బస ఏర్పాటైంది. వెంటనే బాబావారు స్త్రీ మండలిని నాసిక్‌కి పంపారు. బాబావారి

దేశాటనకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వెంట పురుషమండలి వెళ్తారు. ఈ ప్రయాణం ఏర్పాట్లలో భాగంగానే స్త్రీ మండలిని నాసిక్‌కి తరలించింది.

ఈ మధ్య అబ్దుల్లా అదోలా వుంటున్నాడు. ఎక్కడికైనా వెళ్ళిపోవాలని వుంది అంటున్నాడు, మండలివారాతని మాటల్ని పట్టించుకోలేదు. ఏదో సరదాకి అంటున్నాడని వాడి మాటల్ని కొట్టేశారు. దానితో వాడు జనవరి 3వ తేదీన "నేనీవేళ వెళ్ళిపోతున్నాను" అనగానే, షాక్ తిన్నట్లయింది అందరికీ. అబ్దుల్లా అంటే అందరికీ ఇష్టం. బాబావారు వాడిని పంపేస్తే అది వేరే సంగతి. వాడంతటవాడే వెళ్ళిపోతానంటే ఎవరికీ ఏంచేయడానికీ పాలుపోలేదు. బాబావారేమన్నా వాడికి చేస్తారేమో, వెళ్ళకురా, ఇక్కడే వుండరా! అంటారేమోనని అనుకొన్నారందరూ. కానీ బాబావారు వాడిని వుండమనలేదు. సరే ఇహ ఇంతే అనుకొని మధ్యాహ్నం స్కూల్లో వాడికి వీడ్కోలు చెప్పారు. అబ్దుల్లా మంచితనం గురించి టీచర్లు మాట్లాడారు. కొత్త కోటు, కొత్త చెప్పుల జత గుర్తుగా ఇచ్చారు. మహదానందంగా స్వీకరించాడు అబ్దుల్లా ఆ కానుకని. ఇవినాకు తీపిగుర్తులు అని వాడు అంటుంటే అందరి కళ్ళు చెమర్చాయి.

ఇంతలో గుర్రపు బండి వచ్చింది. వాడి పెట్టి, పరుపు బండిలో పెట్టారు. అబ్దుల్లా బండి ఎక్కాడు. బోర్కరు కూడా వాడి ప్రక్కనే కూర్చొన్నాడు. స్టేషన్‌కేసి బండి కదిలింది. వెంట సైకిల్‌పై బయలుదేరాడు రావ్ సాహెబ్. ఐదు గంటలకి రైలు. ఆ రైలు మెహెరాబాద్ మీదగానే పోవాలికదా. రైలుకూత వినిపించగానే, టీచర్లు, పిల్లలు పట్టాల దగ్గరకి పరుగెత్తుకు వచ్చారు. అబ్దుల్లా కనబడగానే చేతులు వూపారు. వాడూ చేయి వూపాడు. కొండకేసి తిరిగి బాబావారికి సలామ్ చెప్పాడు.

అబ్దుల్లా కథకి తెరపడింది అనుకొంటున్నారా పాఠకమహాశయా!

అలా అనుకొంటే పప్పులో కాలు వేసినట్లే! బాబావారి గురించీ, బాబా ఆశ్రమ పిల్లల గురించీ మీకు ఇంకా ఏమీ తెలియదన్నమాటే! ఈమాట ఎందుకు అనాల్సి వచ్చిందంటే, జనవరి 5వ తేదీన ఏమయిందో చదవండి. మీకే తెలుస్తుంది.

మెరిడిత్‌స్టార్ కుటుంబాన్ని ఓడ ఎక్కించి, వచ్చారా రోజున ఆదీ, పాద్రీ గారు. మెహెరాబాద్‌కేసి వస్తుంటే వాళ్ళకి రోడ్డుమీద అబ్దుల్లా కన్పించాడు. ఏమయిందిరా నీకు అని అడిగితే, ఏమోనబ్బా! వుండాలి అనిపించలేదు ఇంటిదగ్గరకు వచ్చేశాను అన్నాడు. అయితే సరే, మాతోరా! ఆశ్రమానికి తీసుకువెడతామని, అబ్దుల్లాని తమ కార్లో ఎక్కించుకొని మెహెరాబాద్‌కి తెచ్చారు పాద్రీ, ఆదీ. అంటే, వాడి విరహం రెండు రోజులేనన్నమాట.

జనవరి 3వ తేదీ రాత్రి బాబావారు మండలితో ఒక మాట చెప్పారు. ప్రపంచాన్ని కుదిపివేసే సంఘటనకి సమయమాసన్నమైందన్నారు. తాము మాట్లాడబోతున్నామన్నారు. నా మాట అందరికీ వినిపిస్తుంది. నేల నాలుగు చెరగులా నా గొంతు వినిపిస్తుంది. అలా వినపడేలా చేస్తాను అన్నారు.

**'మెహెర్ మెసేజ్'** పత్రికని దస్తూర్ ప్రచురిస్తున్న సంగతి తెలుసుగా. దస్తూర్ పత్రికలో తమకేమీ సంబంధంలేదని బాబావారు జనవరి 6వ తేదీన స్పష్టం చేశారు. మెహెర్ మెసేజ్‌కి ఆమడ దూరంలో వుంటున్నానన్నారు. అది (పత్రిక) మండలికీ దస్తూర్‌కి సంబంధించిన వ్యవహారమని తేల్చేశారు. తమకేమీ పట్టదన్నారు. ఆమాట వినగానే దస్తూర్‌కి తల తిరిగినట్లయింది. ఏమీ పాలుపోలేదు. రావ్ సాహెబ్‌పై విరుచుకుపడ్డాడు. నువ్వే కారణం. నీవల్లనే బాబావారు నా పత్రికకు దూరంగా వుంటున్నారని నోరు పారేసుకొన్నాడు. నేనేం చేశానయ్యా! నన్నాడిపోసుకొంటున్నావ్ అని రావ్ సాహెబ్ అన్నాడు. మాటామాటా పెరిగింది. పెద్ద వాగ్వాదమైంది.

బాబావారు కలుగజేసుకొన్నారు. ఇద్దర్నీ శాంతింపచేశారు. పత్రికలో తప్పులు దొర్లుతున్నాయి అందుకనే దానికి దూరంగా వుండదల్చానన్నారు. దస్తూర్ చేసిన ఓ తప్పు ఎత్తిచూపించారు. ఫలానా విషయంలో మూల అర్థం వేరు. నీ పొరపాటు వల్ల వస్తున్న అర్థం మరొకటి అని చెప్తూ, ఆ విషయ వివరణ చేశారు.

ఆ రాత్రి, ముందుముందు ఏంచేయాలి అన్న అంశం చర్చకు వచ్చింది. మండలివారు తమకి తోచిన సలహానిచ్చారు. బాబావారొక మాట అన్నారు. ఏసు ప్రభువు కంటే కూడా ఎక్కువగా తాము శారీరకంగా బాధ పడాల్సివస్తుందన్నారు. ఈ సంగతి నాకు తెలుసు అయినా సరే నేను దేవుడిని అనే చెబుతున్నాను. చదువుకొన్నవాళ్ళు నమ్మరు. ఆ మనిషి దేముడవుతాడా ఎప్పటికైనా అని కొట్టి పారేస్తారు. పెదవి విరుస్తారు. ఇదో బూటకం అంటారు. అది వాళ్ళ మనస్తత్వతం. నేను వాళ్ళ మాటల్నీ విమర్శలనీ పట్టించుకోను. నేను ఎవరినో నేను అదే అని చెప్తుంటాను.

జనవరి 7వ తేదీన మాటల మధ్యలో బాబావారు ఇంకో సంగతి శెలవిచ్చారు. మీరు వెదుకుతున్న దేముడు ఎక్కడో ఆకాశంలో లేడు. ఇక్కడే, ఈ భూమిమీద వున్నాడు దేముడు అని అంటూ ఆ దేముడిని నేనే అని ఘంటాపథంగా చెప్పారు.

ఏదో గుడిలోనో, మసీదులోనో, చర్చిలోనో తాము లేనన్నారు. మీలో వున్నాను. మీ మనస్సులో వున్నాను. కాబట్టి మీలో గుండెలోతుల్లో వెతకండి కన్పిస్తాను అన్నారు. ఇది ఎలా సాధ్యం అనవచ్చు మీరు. అబ్బే! అసాధ్యం అనవచ్చు. నామాట కొట్టిపారేయవచ్చు. సరే! మీ అపనమ్మకమే నిజమనుకొందాము. ఒకమాట చెప్పండి. కళ్ళతో ప్రపంచాన్ని చూస్తున్నారు కదా, మరి ఆ కళ్ళు మీ ముఖాన్ని చూస్తాయా? చూడవు, చూడలేవు. అవునా. ఎవరి కళ్ళకి వాళ్ళ రూపం కనబడదు కదా! మరి మీ ముఖాన్ని మీరు చూడాలనుకొంటే, అద్దంకావాలి. అలానే, మీరు మీ నిజరూపాన్ని చూడాలనుకుంటే ప్రేమ అనే అద్దంకావాలి. అటువంటి అద్దం – ప్రేమ అద్దం ఎవరిదగ్గర వుందో తెలుసా? ఆ అద్దం సద్గురువు దగ్గరే వుంది. ఇంకెవ్వరి దగ్గరా లేదు. ప్రేమ అద్దం కేవలం సద్గురువు సొత్తు అని చెప్పారు. సద్గురువు సాయంతో పరమాత్మని చూడవచ్చన్నారు.

తామే యుగావతారుడు కాబట్టి ఇంకెక్కడికీ వెళ్ళనక్కర్లేదనీ, తమవల్లనే ఆ అదృష్టం దక్కుతుందని చెప్పకనే చెప్పారు.

పిల్లలతో మాట్లాడుతున్నా, మండలివాళ్ళతో మాట్లాడుతున్నా బాబావారు అల్ – హల్లాజ్ కవితని తరుచు ప్రస్తావిస్తున్నారు. అతను సూఫీ కవి. కవి అనేకంటే గొప్ప మస్తు అంటే సబబు. దైవోన్మత్తతలో మునిగి తేలుతూ ఎన్నో అద్భుత కవితలు వ్రాశాడు. బాగా నచ్చిన కవిత – భగవంతుడు – భక్తుడు ఒక్కటేనన్న రచన.

భగవంతుడికీ – భక్తుడికీ తేడా లేదనీ, ఇద్దరూ వేర్వేరు కాదనీ, భగవంతుడు – భక్తుడు ఒకే శరీరంలో వుండే రెండు ఆత్మలనీ ఆ కవిత సారం.

హల్లాజ్ అరబ్బీలో వ్రాసిన ఈ కవితని ఆర్.జె.ని కొల్సన్‌గారు ఇంగ్లీషులోకి తర్జుమా చేశారు. బాబావారు ఇంగ్లీషు కవితనే ఉదహరించేవారు తరచు.

"ప్రేమిస్తున్నదీ – ప్రేమించబడుతున్నదీ ఒక్కరే. అతను నేనే, నేనే అతను మేమిద్దరం ఒకే శరీరంలోని రెండు ఆత్మలం నువ్వు నన్నుచూస్తే అతడిని చూసినట్లే, అతడిని చూస్తే మా ఇద్దర్నీ చూసినట్లే" ఇదీ ఆ కవిత.

బాబావారి జీవిత చరిత్రని బైలీ గుజరాతీలో వ్రాశాడు. అంకితం అన్నచోట ఆల్ – హల్లాజ్ కవితని వేయమని బైలీకి చెప్పారు. కారణాలు తెలియవుకానీ, ఆ పుస్తకం వెలుగుచూడలేదు. గ్రంధకర్త బైలీ – బాబావారి చిన్నప్పటి నేస్తం, తెలుసుగా పాఠకులకి.

పెండూకి జలుబు చేసింది. దగ్గుతున్నాడు కూడా. డాక్టర్ సాధే మందులిస్తున్నాడు. జలుబు తగ్గడంలేదు. దగ్గూ తగ్గలేదు. డాక్టర్ గారి దగ్గర కాంపౌండరు బెహ్రాం. ఇతను ఎవరో తెలుసుకదా. బాబావారికి స్వయానా తమ్ముడు. పొరపాటున అనండి, గ్రహపాటున అనండి ఓ రోజున డాక్టరు గారు చెప్పినట్లు నాల్గయిదు ద్రావకాలు కలిపి మందు చేశాడు. కాస్తంత హైడ్రోక్లోరిక్ యాసిడ్ పోసి మరీ ఇచ్చాడు పెండూకి. అంటే ఇహ చూసుకోండి గొంతులోకి మందు దిగిందో లేదో పెండూ మంట – మంట అని అరిచాడు. యాసిడ్ ఎక్కడైనా పడితే కాలి పుండవుతుంది. మరి గొంతులోకి పడితే ఇంకేముంది గొంతుక పుండయింది. ఇక్కడ లాభంలేదు వెంటనే పూనా ససూన్ ఆస్పత్రిలో చూపించమని బాబావారు ఆదీని ఆదేశించారు. వెంటనే పూనా బయలుదేరారు. వీళ్ళ వెంట నౌసర్వాన్ డాక్టర్ సాధే కూడా బయలుదేరారు.

ససూన్ ఆస్పత్రి డాక్టర్లు పెండూ పరిస్థితి చూసి వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. ఆలస్యం చేయకూడదు. వెంటనే ఆపరేషన్ చేస్తామని ఏర్పాట్లు మొదలుపెట్టారు.

ఈ కబురు వినగానే బాబావారు కోపంతో ఊగిపోయారు. కనిపించిన ప్రతి వస్తువునీ గిరవాటేశారు. అందరూ భయపడ్డారు. బాబావారికి ఎదురుపడటానికే జంకారు. సుమారు అరగంట సేపటికి బాబావారు శాంతించారు. మర్నాడు అంటే జనవరి 8వ తేదీన పూనా నుంచి టెలిగ్రాం వచ్చింది. పెండూకు ఆపరేషన్ లేకుండానే నయం చేశారట. ఓ నల్గయిదు

రోజులు గొంతు మంటగా వుంటుంది. మందులు వేసుకుంటే తగ్గిపోతుందట. అందరూ హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారు. తన తప్పుని అన్నగారికి చెప్పలేదు బెహ్రాం. కాస్తంత కోపం తగ్గేవరకు తప్పించుకొని తిరిగాడు. అయినా సర్వేశ్వరుడికి తెలీని సంగతి ఉంటుందా? వారంరోజుల్లో పెండూకి గొంతు నయమయింది. మెహెరాబాద్‌కి తిరిగివచ్చాడు. బాబావారతన్ని వెంటనే క్వెట్టా వెళ్ళమన్నారు. అక్కడ రూసీ ఇరానీతో కలిసి పనిచేయమన్నారు. గుస్తాద్‌గారి తమ్ముళ్ళు – శ్లామ్ సన్, హోమీలు ఇండోర్‌కి ప్రయాణమయ్యారు.

బాబావారు పాదయాత్రకి వెడతామన్నారు. తమవెంట కొంతమందిని తీసుకువెడతామన్నారు. ఎవరా అదృష్టవంతులు? పురుషమండలివారు కొందరు, స్కూలు పిల్లలు కొందరు. పాదయాత్రకి మహూర్తం పెట్టలేదు ఇంకా. ఏర్పాట్లు మాత్రం చకచక జరుగుతున్నాయి.

జనవరి 12న మెహెరాశ్రమం, ప్రేమాశ్రమం పిల్లలందర్నీ ఇళ్ళకీ పంపేయనున్నారు బాబా. వెంటనే వాళ్ళ తల్లిదండ్రులకి టెలిగ్రామ్‌లు వెళ్ళాయి. స్కూలు మూసేస్తున్నారు. కాబట్టి వచ్చి, మీ పిల్లల్ని తీసుకువెళ్ళండి – ఇదీ టెలిగ్రామ్ పంపిన సందేశం.

టెలిగ్రాం పంపిన మర్నాడు అంటే 13వ తేదీన వచ్చాడు ఆఘా ఆలీ తండ్రి. హాజీముహమ్మద్. అప్పటికి ఇంకా ఎవరూ రాలేదు. 'ఆలీ వెళ్ళిపోతే, అంతా పోతుంది' అన్న బాబా వాక్కు నిజమయింది ఆవేళ.

ఆలీ ఇంటిదారి పట్టగానే, మిగిలిన పిల్లలు కూడా తమ ఊళ్ళకి బయలుదేరారు.

పరిష్యా నుంచి వచ్చిన పిల్లల్ని పంపటమెలాగ? వాళ్ళని దింపివచ్చే బాధ్యత గుల్ సాహెబ్‌పై పడింది.

పాపం ఆ పిల్లలికి మెహెరాబాద్ వదలాలని లేదు.

బాబా కాళ్ళమీద పడి బావురుమన్నారు. పంపకు బాబా మమ్మల్ని, నీ దగ్గరే వుంటామని వాళ్ళు ప్రాధేయపడ్తుంటే చూసేవాళ్ళకి గుండె పిండినట్లయింది.

కాని కరుణామయుడికి కరుణ కలగలేదు.

రావ్ సాహెబ్‌తో వెళ్ళండి. మీకు అంతా మంచి జరుగుతుంది అని ఆశీస్సులు మాత్రం చెప్పారు. వాళ్ళు స్టేషన్‌కి బయలుదేరారు. రమ్జూ బాధపడ్డాడు. అరే, నేనేమీ చేయలేకపోతున్నానే వీళ్ళ కథలని నలుగురికీ చెప్పానే తప్ప, బాబావారికి చెప్పలేకపోయానే అని అతను మథన పడుతుంటే బాబావారు బాధపడకు అన్నారు. ఆశ్రమం మూసేయడానికీ,

ఆలీకీ ఏదో అవినాభావ సంబంధం వుంది. నువ్వే చూస్తున్నావుగా అన్నారు. అంత దు:ఖంలోనూ రమ్జూ నిజమేనంటూ తల వూపాడు. మెహెర్, ప్రేమాశ్రమాల రుధిర కంఠాలు – రుధిర హృదయాల్లో ఒకడయ్యాడు.

**సశేషం**

ప్రత్యేక కార్యక్రమాలు

# విశాఖ సాగర తీరాన

స్థానిక బాబా ప్రేమికుడు శ్రీ చంద్రశేఖరరావు శ్రీకాకుళం బాబా సెంటర్ గోల్డెన్ జూబ్లీ సంబరాల సందర్భంగా ఏర్పాటయిన ప్రత్యేక సహవాస్‌లో పాల్గొనేందుకు వెళ్ళి బాబావారి నాటిక రిహార్సలు చేస్తూ, అకస్మాత్తుగా తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. శ్రీ చంద్రశేఖరరావు జ్ఞాపకార్థం విశాఖ బాబా సెంటర్‌లో ఆగష్టు 26న ప్రత్యేక ప్రేమిక సహవాస్ నిర్వహించినట్లు అధ్యక్షులు శ్రీ మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, విశాఖ నగర శివార్లలోని మధురవాడకు సమీపంలో గల బక్కన్న పాలెంలో గ్రామీణ మెహెర్ ప్రేమిక సత్సంగ్ సెప్టెంబరు నెల ఆఖరి ఆదివారం ఏర్పాటు చేశామని, అక్కడున్న పేద గ్రామీణులకు దుప్పట్లు, బాబా సాహిత్యాన్ని, బాబావారి ఫోటోలు - లాకెట్లు పంపిణీ చేసి, బాబా సందేశాలను స్థానికులకు అర్థమయ్యేలా వివరించామని తెలిపారు. కాగా, సెప్టెంబరు 30న మహిళా ప్రేమిక సహవాస్ విశాఖ బాబా సెంటంలో ఘనంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ సహవాస్‌లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. నాగార్జున యూనివర్శిటీ నుండి అవతారుని సందేశాలపై యం.ఫిల్ చేసిన శ్రీమతి జి. హరిప్రియ (సింహాచలం) ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. శ్రీ వల్లూరి నాగేశ్వరావు రచించిన **అవతార్ మెహెర్‌బాబా-పంచ సద్గురువులు** అంశంపై చక్కని నాటిక ప్రదర్శించారు. ప్రొఫెసర్ బి. కేశవరావు,విజయవాడ, బాబా సందేశాలపై ప్రసంగించారు. శ్రీమతి వరలక్ష్మి, శ్రీమతి సుభద్ర, శ్రీమతి తులసి కుమారి, శ్రీమతి భారతి, తదితరులు కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు.

## వివాహము

పాలకొండ బాబా సెంటర్ ప్రేమికులు శ్రీమతి గొర్లె రామలక్ష్మి, శ్రీ కృష్ణంనాయుడు గార్ల కుమారుడు చి॥ ధనుంజయరావు వివాహము చి॥ల॥సౌ॥ మెహెర్ ఉషారాణితో 28.10.2012 ఉదయం 11.02 ని॥లకు అవతార్ మెహెర్‌బాబా సెంటర్, పాలకొండలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

## వివాహము

విశాఖపట్నం బాబా ప్రేమికులు శ్రీ రావుల రాధాకృష్ణ గారి మనువడు చి॥ మెహెర్ శ్రీనివాస్ వివాహము చి॥ల॥సౌ॥ నాగ కృష్ణవేణితో 27.10.2012 రాత్రి 10.26 ని॥లకు గురుజాడ కళాక్షేత్రం, సెక్టర్-8, వైజాగ్ స్టీల్ ప్లాంట్ నందు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# బాటసారులు

## భగవదున్మత్తులతో మెహెర్‌బాబా




ఈ గ్రంధాన్ని **THE WAYFARERS** -MEHER BABA WITH THE GOD INTOXICATED అని ఇంగ్లీషులో తొలిసారిగా 1948లో పాశ్చాత్య బాబా మండలి ప్రేమికుడు – **విలియం డాంకిన్** ముద్రించారు.

ఈ గ్రంధానికి తొలిపలుకులు మెహెర్‌బాబా స్వయంగా రాశారు.

అంతేకాదు, ఈ పుస్తకంలోని అన్ని అంశాలు మెహెర్‌బాబా స్వయంగా పరిశీలించి తగిన సూచనలు – మార్పులు చేర్పులూ కూడా చేశారు. కఠిన మౌనంలో వుండి మన దేశంలో కొన్ని వేల మైళ్ళ దూరం అలుపెరుగక అనేక ఇక్కట్లు ఎదుర్కొని ప్రయాణం చేసి, పిచ్చివాళ్ళ లాగా కనిపించే భగవదున్మత్తులతో మెహెర్‌బాబా నెరిపిన సాంగత్యాన్ని కళ్ళకు కట్టినట్లు ఈ గ్రంధంలో విలియం డాంకిన్ మెహెర్‌బాబా ప్రేమికులందరి కోసం అందజేశారు.

అవతారుని కార్యక్రమాలలో మస్తు జనోద్ధరణ అత్యంత ప్రధానమైంది. 1938 నుండి 1948 వరకూ సుమారు ఒక దశాబ్ద కాలం మెహెర్‌బాబా 75 వేల మైళ్ళు ప్రయాణించి 25 వేల మంది మస్తులను కలిసారు. కాగా ఇంగ్లీషులో వున్న ఈ గ్రంధాన్ని బాబా ప్రేమికులు శ్రీ టి. కుటుంబశాస్త్రి గారి కుమారుడు, **శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ**, తెలుగులో అనువదించి – జూన్ 2012లో ప్రచురించారు. ఆధ్యాత్మిక గ్రంధమైన **బాటసారులు గ్రంధాన్ని** చక్కని సరళ, వ్యావహారిక తెలుగులో పాఠకులందరికీ అర్ధమయ్యేలా రాశారు. ఒరిజినల్ ఆంగ్ల ప్రతికి సరైన నమూనాగా ఈ గ్రంధం ఉంది. మస్తుల యాత్రకు సంబంధించిన మ్యాపును కూడా అదనంగా పుస్తకంతో పాటు రచయిత అందజేశారు. ఎంతో శ్రమతో కూడిన గ్రంధమిది. బాబా ప్రేమికులు ఎంత కాలంగానో ఎదురుచూస్తున్న గ్రంధం కూడా. గతంలో బాటసారులు పేరిట ముద్రించిన అనువాద గ్రంధాలు ప్రస్తుతానికి అలభ్యంగా వున్నాయి. ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు, పుస్తక ప్రియులు తప్పక చదవవల్సిన గ్రంధం– **బాటసారులు.** ప్రతి ఇంటా తప్పక ఉండవల్సిన 800 పేజీలుగా ఉద్గ్రంధమిది.

**పుస్తక ప్రాప్తిస్థానం:** Krishna T.A.C/O Meher Chaitanya Niketan Trust, **TAPESHWARAM - 533 340, East Godavari District**

**ప్రచురణ కర్తలు పుస్తక వెలను గ్రంధంలో పేర్కొనలేదు.**

# పూజ

మెహెర్‌బాబా వారి సందేశాలు, ప్రవచనాల ఆధారంగా యదార్ధ పూజా మార్గం చూపేలా బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ భావూ కల్చూరీ హిందీలో రాసిన పూజ గ్రంధాన్ని ఆసాంతం తెలుగులో శ్రీ సామల రాజమల్లయ్య, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా (92900 88560) అనువదించారు.

ఈ సంచికలో 'పూజ' గ్రంధంలోని ప్రధమ అధ్యాయంలో పేర్కొన్న కొన్ని పద్యాలు మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా శ్రీ రాజమల్లయ్య పంపారు. దయచేసి పరిశీలించండి. సుమారు 35 పేజీలు గల 'పూజ' పుస్తకం ఆవిష్కరణకు సిద్ధంగా వుందని శ్రీ సామల తెలిపారు.

## పూజ

### ప్రధమ అధ్యాయం
### కాలము (సమయము) ప్రార్ధన చేస్తుంది

1. ప్రజల భీషణ రోదనల్ ప్రబలె జగతి
వినుము, వినుమయ్య! మాదైన విన్నపమును
బాబ! మా దు:ఖ భారమున్ బాపుమయ్య!
ఉన్నదొక్కడ వీవె! మాకున్న దిక్కు ॥వినుము॥

2. భీకరమగు దు:ఖ తుఫాను పీడ వలన
అలమటించసాగిరి జనులవని పైన
లే రెవరు దీని దొలగించు వారు మెహెరు!
నీవు గాక! ఈ భువిపైన నిక్కముగను ॥వినుము॥

3. దు:ఖ సీమను లంఘించు దొడ్డదైన
మార్గమును జూపుమో బాబ! మాకు నీవు
దయను మాపైన కురిపించు దైవమీవె!
కరుణ కాధారుడవు నీవె! కన్నతండ్రి!
వినుము, మినుమయ్య! మాదైన విన్నపమును
బాబ! మా దు:ఖ భారమున్ బాపుమయ్య! ॥వినుము॥

# బాబాలో ఐక్యం


శ్రీమతి అలివేలు


శ్రీమతి పి. రాజేశ్వరి


శ్రీ ఎ. యస్. ఆర్. మూర్తి,


శ్రీమతి సెట్టి విజయ

శ్రీ చంద్రమోహన్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ గారి భార్య **శ్రీమతి అలివేలు** స్వల్ప అస్వస్థతతో అవతారుని నామం స్మరిస్తూ 2012 అక్టోబరు 4న బాబాలో ఐక్యమయినట్లు శ్రీ క్రాంతి మెహెర్ జెల్ధా తెలిపారు.

**శ్రీమతి పి. రాజేశ్వరి (80),** కూకట్‌పల్లి, హైదరాబాద్, బాబా నామం జపిస్తూ, అక్టోబర్ 2న తీవ్ర గుండెపోటుతో బాబాలో ఐక్యమయినట్లు ఆమె కుమారుడు శ్రీ పిడుగు అప్పారావు తెలిపారు.

**శ్రీ ఎ. యస్. ఆర్. మూర్తి,** కాకినాడ (63) అక్టోబరు 10న స్వల్ప అస్వస్థతతో కన్నుమూశారు.

శ్రీ సెట్టి కోటేశ్వరరావు గారి భార్య **శ్రీమతి సెట్టి విజయ,** విశాఖపట్నం, బాబా నామస్మరణలో 26.08.2012న బాబాలో ఐక్యమయినట్లు తెలిపారు.

# చల్లపల్లి బాబా సెంటర్

చల్లపల్లి బాబా సెంటర్‌లో స్థానిక సెంటర్ అధ్యక్షులు శ్రీ చుండూరు నాగేశ్వరరావుగారి మెహెర్‌బాబా రైస్‌మిల్ నందు జరిగిన బాబా సహవాస్‌లో 35 బాబా సెంటర్ల నుండి సుమారు 2000 మంది పాల్గొన్నారు. బాబా పాదుకల దర్శన కార్యక్రమం జరిగింది.

ట్రస్టీ మెహెర్‌నాథ్ కల్చూరీ, శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీమతి రాజేశ్వరి కల్చూరి, శ్రీ తోట నాగేశ్వరరావుగారు, శ్రీ కోసూరు మురళీకృష్ణారావుగారు, శ్రీమతి తాడేపల్లి శ్యామల, శ్రీ దాసరి మెహెర్ హేమంత్, శ్రీ విన్నకోట సత్యన్నారాయణ, శ్రీ యు. బాపిరాజు, కుమారి మాధవీలత, శ్రీమతి శివనాగేశ్వరి, శ్రీ టి. ప్రసన్నకుమార్, శ్రీ వై.ఎస్. రావు, శ్రీ ఎ. సాంబశివరావు, డా. బి.హెచ్. కేశవరావుగారు తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు.

# ముఖచిత్రం

## బాలనాటు, మెహెరాబాద్ 1994 ఫిబ్రవరి 13



ఈ సంచికలోని ముఖచిత్రం (మొదటి అట్టమీద ముద్రించిన చిత్రం) బాబా ప్రేమికులందరికీ సుపరిచితమే.

ఈ చిత్రాన్ని దర్బార్ ఫోజు ఫోటో అని పిలుస్తారు.

ఈ ఫోటో సర్వ సామాన్యంగా మెహెర్‌బాబా ప్రేమికులందరి ఇళ్ళలో తప్పక వుంటుంది.

మెహెరాజాద్‌లో 'బ్లూ బస్'లో కూడా ఈ ఫోటోను మండలి వారుంచారు. ఈ చిత్రంలో మెహెర్‌బాబా ఎంతో హుందాగా, రాచ ఠీవీతో కూర్చుని వున్నారు. ముఖ్యంగా బాబావారి పాదాలు స్పృశించామన్న తృప్తి ఈ చిత్రంలో లభిస్తుంది. ఇది మెహెర్‌బాబా బాగా ఇష్టపడిన చిత్రంగా పేర్కొంటారు. ఇంతటి విశేషం గల ఈ ఫోటో వెనుక ఒక చక్కని, ఆసక్తికర సంఘటన దాగి వుంది.

మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహిత ప్రేమికులు శ్రీ బాలనాటుకు ఈ సంఘటనతో నేరుగా సంబంధముంది. శ్రీ బాలనాటు ఆ వివరాలను క్లుప్తంగా 1994 ఫిబ్రవరి 13న మెహెరాజాద్ నుండి ఒక లేఖలో బాబా ప్రేమికులందరి కోసం తెలియజేశారు.

ఆ వివరాలు బాబా ప్రేమిక పాఠకులందరూ తప్పక తెలుసుకోవాలి!!

ఐతే, ఈ విషయాలు ఇప్పటికే కొంతమందికి తెలిసుండవచ్చు. ఐనాకూడా, ఫరవాలేదు మరోసారి పరిశీలించండి!!

ఆ దరిమిలా వీలైతే స్పందించగలరు!!

బాలనాటు రాసిన లేఖాంశం ఇలా వుంది!

ఇకపై బాలనాటుగారి మాటల్లోనే... ...,

దర్బారు ఫోజు చిత్రాన్ని బాబా భక్తులే కాదు, మెహెర్‌బాబా కూడా ఈ ఫోటోని బాగా ఇష్టపడేవారు. ఈ ఫోటోని పూనే నగరంలో వుండే ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్ శ్రీ రీగే 1960 ప్రాంతంలో మెహెర్‌బాబా, గురుప్రసాద్ భవనంలో వుండగా తీశాడు.

ఈ ఫోటో తీయడానికి ముందు ఒక చక్కని కథ వుంది.

అదంతా నా వల్లనే జరిగింది కాబట్టి, అదేదో వివరంగా తెలియజేస్తాను దయచేసి ఆలకించండి!! 1958వ సంవత్సరం నుండి వేసవి కాలంలో మెహెర్‌బాబా పూనేలోని గురుప్రసాద్ భవంతిలో తన మండలివారితో కల్సి వుండేవారు.

నేను షోలాపూర్‌కు దగ్గర్లో వున్న కురుద్వాడి అనే గ్రామంలో స్కూలు టీచర్‌గా పనిచేసేవాడిని. ఒక సందర్భంగా మా స్కూలుకు వరుసగా ఆరు వారాలు సెలవులు ఇచ్చారు. ఆ సమయంలో బాబా పూనే గురుప్రసాద్‌లో వున్నారు. ఆ సెలవురోజుల్లో నాకు గురుప్రసాద్‌లో బాబా సమక్షంలో గడిపేందుకు బాబా అనుమతించారు. అలా నేను బాబా దగ్గరకు చేరాను. ఆ సమయంలో బాబా నాకు అప్పగించిన పని ఏమంటే – నిత్యం బాబాకు వచ్చే ఉత్తరాల బట్వాడాలో, మరాఠీ ఉత్తరాలను మాత్రం బాబా ఎదుట చదివి, బాబావారి సూచనలు మేరకు వాటికి తగిన జవాబులు రాసి తిరిగి పోస్టు చేసేవాడిని. ఇంగ్లీషులో వచ్చిన ఉత్తరాలు ఏరుచ్ బాబాకు చదివి వినిపించేవాడు.

అది బహుశా 1960వ సంవత్సరం. శ్రీ రీగే, ఫోటోగ్రాఫర్ నుండి ఒక పోస్టుకార్డు బాబాకు వచ్చింది. ఆ లేఖలో అతనేదో గొప్ప ఫోటోగ్రాఫర్‌ననీ, ఇప్పటికే తాను వి.వి.ఐ.పి.లు ఎందరికో ఫోటోలు తీసి వున్నానని చెప్పాడు. అంతేకాదు, తనకొక ప్రత్యేక అవకాశం బాబా కల్పిస్తే, మెహెర్‌బాబా ఫోటో చాలా అందంగా తీస్తానని ఆ లేఖలో అతను రాశాడు. ఆ రోజుల్లో బాబా నాకొక మంచి అవకాశం ఇచ్చారు. అదేమంటే బాబాకు వచ్చిన ఉత్తరాల్లోంచి నాకిష్టమైన కొన్ని ఉత్తరాలు మాత్రమే చదివి వినిపించే అవకాశం, స్వేచ్ఛ బాబా నాకిచ్చారు. ఇది బాబా నాకిచ్చిన ఒక చిన్న విశేషాధికారం.

శ్రీ రీగే రాసిన లేఖను చదివాక, నాకెందుకో ఆ లేఖలోని సారాంశం నాకు నచ్చలేదు. నా మనస్సు ఎందుకో ఆ లేఖను బాబా ఎదుట చదవడానికి సుతరామూ అంగీకరించ లేదు. శ్రీ రీగే లేఖలో ఏదో తెలియని గర్వం తొణికిస లాడిందనిపించింది. దాంతో శ్రీ రీగే లేఖను నా దగ్గరున్న లేఖల దొంతరలో అన్నింటికంటే అట్టడుగున, చివరాఖరుగా వుంచాను. ప్రతిరోజు సాధారణంగా బాబా నా చేత రెండు లేదా మూడు ఉత్తరాలు చదివించుకుని ఆపై ఇక చాలని సంజ్ఞలు చేసేవారు. ఆ మాదిరిగా శ్రీ రీగే లేఖ బాబా కంటపడదని ధీమాగా నేనున్నాను.

ఆ మర్నాడు, ఏరుచ్ తన దగ్గరున్న ఉత్తరాలు ఇంగ్లీషులో వున్నవాటినన్నింటినీ బాబాకు చదివి వినిపించాడు. ఆ రోజు ఎందుకనో ఏరుచ్ దగ్గర చాలా తక్కువ ఉత్తరాలున్నాయి. అతని పని త్వరగా ముగించే సరికి, బాబా నాకేసి చూశారు. మరాఠీ లేఖలు చేతబట్టి

చదవమన్నట్లు సైగ చేశారు. సాధారణంగా వచ్చిన ఉత్తరాలలోని సారాంశం చెబితే, బాబా వాటికి జవాబు ఏం రాయాలో సంజ్ఞలు చేస్తూ సూచించేవారు. ఆ రోజున బాబా చాలా సంతోషంగా వున్నారు. హుషారుగా, ఆనందంగా వున్నారు. దాంతో నా చేతిలో వున్న ఉత్తరాలన్నింటినీ ఒక దాని తర్వాత మరోకటి చొప్పున చదవమన్నారు.

నేను ఒకొటొకటే చదువుతూ వుంటే, బాబా ఇంకా..., ఇంకా..., అంటూ – చివరాఖరులో ఆఖరు లేఖగా వుంచిన శ్రీ రీగే ఉత్తరం కూడా చదవాల్సి వచ్చింది. విచిత్రం! నాకీ పరిస్థితి ఎదురౌతుందని నేను ఊహించలేదు. శ్రీ రీగే ఉత్తరాన్ని సెన్సార్ చేద్దామనుకున్నాను. కానీ, నా ప్రయత్నం ఫలించలేదు సరికదా, రీగే ఉత్తరాన్ని పూర్తిగా చదవకుండా, ఆ ఉత్తరంలోని సారాంశాన్ని చదివి వినిపించాను. ఆ సారాంశం చదివే రీతిలో కూడా ఒకింత నాకు నచ్చలేదు అన్న ధోరణి కనపడేలా బాబాకు వినిపించాను.

బాబా కూడా నా అభిప్రాయంతో అంగీకరిస్తారని నా మనస్సులో అనుకున్నాను. కానీ, అలా జరగలేదు. ఆ ఉత్తరాన్ని ఆసాంతం చదవమన్నారు. నేను చదవడం పూర్తి కాక మునుపే, బాబా ఏమన్నారనుకున్నారు...బాబా నాకేసి చూస్తూ –

**That's fine! When should we call him?**

అంతా బాగుంది. ఐతే అతడ్ని ఎప్పుడు రమ్మనమని పిలుద్దాం? అని అన్నారు.

దాంతో ఆశ్చర్యపడటం నావంతైంది. ఏదైనా ఒక తారీఖు ఖరారు చేసి, అతను వచ్చినప్పుడు అతనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు నన్నే చూడమని బాబా ఆదేశించారు.

నేను ఖంగుతిన్నాను. బాబా ఆదేశాలను విధేయతతో అమలు చేస్తూ, శ్రీ రీగేను పూనే గురుప్రసాద్‌కు ఆహ్వానిస్తూ ఉత్తరం రాశాను.

శ్రీ రీగే ఫోటో తీసే సందర్భంలో కూడా బాబా చాలా సంతోషంగా అగుపించారు. అతను అడిగిన ప్రతి చిన్న విషయానికి బాబా సంతోషంగా తన ఆమోదం తెలిపారు. నాకు తెలిసి బాబా ఎన్నడూ ఏ ఫోటోకి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదు. ఈ చిత్రానికి ఫోజు ఇస్తూ కూడా బాబా నాకేసి క్రీగంట చూశారు. ఆ చూపులో అనేక అర్థాలు నాకు స్ఫురించాయి. ఫోటోగ్రాఫర్ మొత్తం 5 రకాల చిత్రాలు తీసుకున్నాడు. ఆ రోజుల్లో ఫోటో తీసుకోవడమంటే, నేటి మాదిరి కాదు సుమీ! అదొక బృహత్తర ప్రయత్నం, గడ్డు రోజులవి!! ఓ వారం రోజుల తర్వాత మనం ఇప్పుడు చూస్తున్న ముఖచిత్రం అందమైన దర్బార్ ఫోజు ఫోటోని శ్రీ రీగా తీసుకొచ్చాడు.

ఈ సంఘటన నాకొక కనువిప్పు. అంతా నాకు తెలుసనే గర్వం కూడదని బాబా సున్నితంగా నాకు హెచ్చరించారు. అంతేకాదు, అవతారునికి అవగతం కానిది ఏమీలేదని చెప్పకనే నాకు తెలియజెప్పారు.

ఈ మాటలుకు ముగింపుగా శ్రీ బాలనాటు తన చేవ్రాలు చేసి ఆనాటి తారీఖు 1994 ఫిబ్రవరి 13 అని చెబుతూ తన లేఖను ముగించారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్థిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహా ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్చానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

**2012 సెప్టెంబర్–అక్టోబర్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | అక్టోబర్ | మల్లాది.రామకృష్ణ, జంగారెడ్డిగూడెం | రూ. 1001.00 |
| 2. | అక్టోబర్ | బొచ్చుల.నాగేశ్వరరావు, వినుకొండ | రూ. 1000.00 |
| 3. | అక్టోబర్ | యస్. గురుచరణ్, హైదరాబాద్ | రూ. 1000.00 |
| | | **మొత్తము** | **రూ. 3001.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/– (వెయ్యి రూపాయలు). 2. రెండు దఫాలుగా కూడా రూ.500/– చొప్పున చెల్లించవచ్చు. 3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ.100/– పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్:** ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్–500087. ఫోన్:99595–53218, **email: malladisukku@gmail.com**

# మెహెరాబాద్ అభివృద్ధికై

మెహెరాబాద్ అభివృద్ధికై బాబా ట్రస్టుకు విరాళాలు అందజేయవల్సిందిగా ట్రస్టు చైర్మన్ భావూ కల్చూరీ ఒక ప్రకటనలో కోరారు. డొనేషన్లు ఆన్‌లైన్ బ్యాంకు అక్కౌంటు –Bank of Maharashtra, M.G. Road Br. Ahmednagar (M.S) SB Account No. 20098450037, IFSC code MAHB0000024 ద్వారా ఆన్‌లైన్‌లో పంపవల్సిందిగా కోరుతున్నారు.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**